మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

15.2.2025 శనివారం Saturday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 305 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట
## రెట్టించిన ఉత్సాహంతో భారత్



# అమెరికా, భారత్ ద్వైపాక్షిక బంధం
# మరింత బలోపేతం

- ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలు
- శాంతి చర్చలకు భారత్ మద్దతు
- అక్రమ వలసదారుల సమస్య అన్ని దేశాలది
- ట్రంప్‌తో భేటీ సందర్భంగా ప్రధాని మోడీ





ప్రధాని నరేంద్ర మోదీ తన అమెరికా పర్యటనలో ఆ దేశ అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. వైట్‌హౌస్‌లో భేటీ అయిన వీరిద్దరూ వాణిజ్యం, భద్రత సహా పలు ఇతర అంశాలపై చర్చించుకున్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్య లోటు భర్తీ చేసేలా అమెరికా నుంచి మరింత చమురు, గ్యాస్ కొనుగోలు చేసేలా రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ట్రంప్ తమతో వాణిజ్య సంబంధాలున్న దేశాలకు వర్తించేలా పన్నులు పెంచిన తరువాత ఈ సమావేశం జరిగింది. తమ ఇద్దరి మధ్య అద్భుతమైన స్నేహ సంబంధాలు న్నాయని, గత నాలుగేళ్ల కాలంలోనూ ఆ సంబంధాలు అలాగే కొనసాగాయని ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రెండు దేశాలు కలిసి మరింతగా వాణిజ్యం జరపాలని తాను కోరుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు.



# ప్రధాని మోడీ అసలు బీసీ కాదు

## ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ

- కులగణన సర్వేపై బిజెపి, బిఆర్ఎస్‌ల తప్పుడు ప్రచారం
- జనగణను తప్పించుకునేందుకే బిజెపి విమర్శలు
- రాహుల్ గాంధీ మాట శిరోధార్యంగా కులగణన
- గాంధీభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, జనతా న్యూస్: ప్రధాని మోడీ బీసీ కాదని.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని ప్రధాని మోడీపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మోడీ పుట్టుకతో బీసీ కాదని.. ఆయన సీఎం అయ్యాక మోడీ కులాన్ని బీసీలో కలిపారని వ్యాఖ్యలు చేశారు. మోడీ కులం గురించి ఆషామాషీగా చెప్పడం లేదని.. అన్ని తెలుసుకునే ఆయన కులం గురించి మాట్లాడు తున్నానని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మిగతా 2 లో

కాంగ్రెస్ బలం.. బలగం
### అంతా యూత్ కాంగ్రెస్సే

- చంద్రబాబు, కెసిఆర్ మూలాలు యూత్ కాంగ్రెస్ నుంచే
- తెలంగాణలో అధికారంలోకి రావడంతో యూత్ కృషి
- కష్టపడి పనిచేస్తే పదవులు అవే వస్తాయి
- యూత్ కాంగ్రెస్ నేతల బాధ్యత స్వీకరణలో సిఎం రేవంత్

### లవర్స్‌డే రోజు దారుణం

యువతిపై యువకుడి యాసిడ్ దాడి
ఏపీలోని గుర్రం కొండలో విషాదం
నిందితుడు టీడీపీ నేత కొడుకు



02



03

# చర్చకు వస్తారా?

- నిధులపై ఎక్కడైనా మాట్లాడటానికి రెడీ
- కేసీఆర్, రేవంత్‌కలిసి వస్తారా?
- మోదీ ప్రభుత్వం ఏం చేసిందో చూపిస్తాం
- కేటీఆర్, హరీశ్‌రావు చర్చకు రెడీనా?
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో ఒరిగిందేమి లేదు
- డబుల్‌ఇంజిన్ సర్కారుతోనే తెలంగాణకు మేలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



వేలకోట్లు ఎగవేస్తున్న వారి నుంచి
# రికవరీ చేశారా

- రైతులు రుణాలు చెల్లించకుంటే తలుపులు ఎత్తుకెల్తారా
- సమావేశంలో బ్యాంకుల తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జనతా న్యూస్:** తీసుకున్న రుణం చెల్లించలే దనే ఒకే ఒక్క కారణంగా సామాన్య రైతుల పట్ల బ్యాం కర్లు వ్యవహరిస్తున్న తీరు దారుణమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్ర హం వ్యక్తం చేశారు. కోడకండ మండలం రైతు ఇంటి గేటు తీసుకెళ్లిన బ్యాంకర్ల తీరును మంత్రి తీవ్రంగా తప్పు పట్టారు. మిగతా 2 లో

### మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఊరట

షరతులతో కూడిన బెయిల్ మంజూరు





## గుమ్మడిదలను లగచర్ల చేయొద్దు

- డంపుయార్డుతో కాలుష్యాన్ని నెత్తిన వేయకండి
- గుమ్మడిదలలో నిరసనకు హరీష్ రావు సంఘీభావం

### రైతులకు కేంద్రం శుభవార్త



- 19వ విడత కిసాన్ నిధుల విడుదల
- 24వ తేదీన రైతుల ఖాతాల్లోకి జమ

02

సీమాంతర ఉగ్రవాదంపై
## ఏకపక్ష నిర్ణయం

- పాక్ హక్కులకు భంగం కలిగేలా ఒప్పందం
- ట్రంప్, మోడీ ప్రకటనపై పాక్ అభ్యంతరం



02

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
శనివారం 15 ఫిబ్రవరి 2025


## మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఊరట



**హైదరాబాద్,ఫిబ్రవరి 14:** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది నాంపల్లి సెషన్స్ కోర్టు. లక్ష రూపాలతో పాటు రెండు పూచికత్తులు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. అలాగే పోలీసుల విచారణకు సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేయవద్దని ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే ఏఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీజీపీ రాధాకిషన్ రావు బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్ట్ అయిన ప్రణీత్ రావు దాదాపు 11 నెలల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ మంజూరు చేయాల్సిందిగా నాంపల్లి కోర్టును ఆశ్రయించారు ఏ2 నిందితుడు ప్రణీత్‌రావు. ఈ పిటిషన్‌పై పలు మార్లు విచారణ జరిపిన న్యాయస్థానం ఎట్టకేలకు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈనెల 11న ప్రణీత్ రావు తరపున న్యాయవాది ఉమామహేశ్వరరావు 1వ అదనపు జిల్లా కోర్టులో వాదనలు పూర్తి చేశారు. అయితే ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి గైర్హాజరు కావడంతో పీపీ వాదనల కోసం విచారణను ఈరోజుకు వాయిదా వేస్తూ జడ్జీ రమాకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గత విచారణలో భాగంగా ఈ కేసులో అరెస్ట్ అయిన వారందరూ బెయిల్‌పై విడుదలయ్యారని.. ప్రణీత్ రావు ఒక్కరే జైలులో ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. ఇదే కేసులో ఉన్న భుజంగరావు, మాజీ డీసీపీ ప్రభాకర్ రావుకు జగన్ 31న మధ్యంతర బెయిల్ మంజూరు చేసిందని చెప్పారు. అలాగే ఏఎస్పీ తిరుపతన్నకు కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు న్యాయవాది. కేసులో వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రణీత్ రావుకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో ఈరోజు సాయంత్రం లేదా రేపు ఉదయం ప్రణీత్ రావు బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## రైతులకు కేంద్రం శుభవార్త

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 :** రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 19వ విడత పీఎం కిసాన్ నిధుల విడుదల తేదీని ఖరారు చేసింది. ఫిబ్రవరి 24వ తేదీన రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు జమ చేస్తామని వెల్లడించింది. ఫిబ్రవరి 24వ తేదీన ప్రధాని మోడీ బీహార్‌లోని భాగల్పూర్‌లో పర్యటిస్తారని.. ఈ సందర్భంగా ప్రత్యక్ష నగదు బదిలీ పద్దతిలో పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తారని కేంద్ర ప్రభుత్వ తెలిపింది. అలాగే.. బీహార్‌లోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోడీ ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం భాగల్పూర్‌లో ఏర్పాటు చేసే సభలో పాల్గొని మోడీ ప్రసంగిస్తారు. పీఎం కిసాన్ నిధుల కోసం ఎదురు చూస్తోన్న రైతులకు ఇది ఒక శుభవార్త అనే చెప్పాలి. కాగా, దేశంలో చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సహాయం చేయడం కోసం 2019లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రారంభించింది. ఈ స్కీమ్ కింద అర్హులైన ప్రతి రైతుకు రూ.2 వేల చొప్పున మొత్తం మూడు విడతల్లో ఏడాదికి రూ.6 ఆర్థిక సహాయం అందజేస్తోంది. ప్రత్యక్ష నగదు బదిలీ పద్దతిలో రైతులకు ఖాతాల్లో కేంద్రం నిధులు జమ చేస్తోంది. ఇందులో భాగంగానే.. 2024, అక్టోబర్ 5న 18వ విడత పీఎం కిసాన్ నిధులను రైతుల అకౌంట్లో జమ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 24న 19 విడత నిధులను రైతుల అకౌంట్లలో వేయనుంది.

## లవర్స్‌డే రోజు దారుణం

**మదనపల్లె:** వాయల్పాడు తరిగొండ మధ్యలో గల ప్యారంపల్లి లో ప్రేమికుల దినోత్సవం అయినా ఈ రోజున దారుణమైన ఘటన చోటుచేసుకుంది. అన్నమయ్య పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలం ప్యారంపల్లికి చెందిన జనార్ధన్, రెడ్డెమ్మ దంపతుల కుమార్తె గౌతమి (23) పై మదనపల్లె అమ్మచెరువు మిట్ట, కోళ్ళ బైలు పంచాయతీ టీడీపీ నాయకుడైన మురళీ కుమారుడు గణేష్ యాసిడ్ తో దాడి చేసి కత్తితో గాయపరిచాడు. గౌతమి మదనపల్లెలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి మదనపల్లె పట్టణం కదిరి రోడ్డులో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది. గణేష్ తరచూ యువతి వెంట పడేవాడు , గౌతమికి ఫిబ్రవరి 7 వ తేదీన పెళ్లి నిశ్చయం అయింది. ఏప్రిల్ 29న పీలేరు జగన్ కాలనీకి చెందిన శ్రీకాంత్ తో పెళ్లి జరగాల్సి ఉంది. అయితే, అమ్మచెరువు మిట్టకు చెందిన గణేష్ శుక్రవారం ఉదయం ప్యారంపల్లికి చేరుకుని గౌతమిని ప్రేమించమంటూ వెంటపడ్డాడు. శుక్రవారం ఉదయం యువతి తల్లితండ్రులు పాలు పిండటానికి వెళ్లడం గమనించి అక్కడికి వెళ్లి గౌతమి తలపై కత్తితో దాడి చేశాడు. ఆ తర్వాత మొహంపై యాసిడ్ పోశాడు. తీవ్రంగా గాయపడిన గౌతమిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే దాడికి పాల్పడిన గణేష్ మదనపల్లె మండలం కోళ్ళబైలు పంచాయతీ వైయస్సార్ కాలనీకి చెందిన టిడిపి నాయకుడు మురళి కుమారుడు కావడం విశేషం. మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గౌతమిని అత్యవసర చికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. అయితే నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారా లేదా వేచి చూడాలి. ఇప్పటికే పోలీసుల అదుపులో వున్నట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రకటించారు. గాయపడిన గౌతమీ నది స్థానిక శాసనసభ్యుడు షాజహాన్ బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు పరామర్శించారు.

## సీమాంతర ఉగ్రవాదంపై ఏకపక్ష నిర్ణయం

**ఇస్లామాబాద్,ఫిబ్రవరి 14:** సీమాంతర ఉగ్రవాదంపై భారత్ అమెరికా సంయుక్త ప్రకటన ఏకపక్షమంటూ పాకిస్థాన్ విమర్శించింది. ట్రంప్,మోడీ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో సీమాంతర ఉగ్రవాదానికి తన భూభాగం వాడుకోకుండా పాక్ చూసుకోవాలని పేర్కొన్నారు. దీనికి పాక్ విదేశాంగ శాఖ ఇది పూర్తిగా ఏకపక్షంగా ఉందని ఆరోపించింది. ముంబై దాడుల కుట్రదారు తహపూర్ రాణా అప్పగింతకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ' తహపూర్ రాణా అప్పగింతకు నా కార్యవర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రపంచంలో అత్యంత భయంకరమైన వ్యక్తుల్లో ఒకడైన అతడు భారత్‌లో విచారణ ఎదుర్కోవాలి ' అని ట్రంప్ పేర్కొన్నారు. ఆ తర్వాత సంయుక్త ప్రకటనలో తప్పుపట్టారు. దీనిపై ఇస్లామాబాద్ లోని పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పందించారు. భారత్ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదాన్ని విస్మరించారంటూ ఆరోపించారు. ' ఇది పూర్తిగా ఏకపక్షం. తప్పుదోవ పచ్చించేది. దౌత్య నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. పాక్ త్యాగాలను లెక్కలోకి తీసుకోకుండానే దీనిలో చేర్చారు. ఇలాంటివి భారత ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం కప్పిపెట్టలేవు. ' అని పాక్ ప్రతినిధి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో రక్షణ పరంగా భారత్‌కు టెక్నాలజీ , ఆయుధాల సరఫరాపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రాంతీయ సమతుల్యతను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.న భారత్‌కు ఎఫ్ 35 విమానాలు సహా పలు ఆయుధాలు విక్రయించేందుకు ట్రంప్ ఆసక్తిని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# మోడీ అసలు బిసియే కాదు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణన నివేదికను తప్పు అంటూ మోడీ, కేడీ బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇకపోతే నేను ఆఖరి రెడ్డి సీఎంను అయినా.. ఫర్వాలేదు. మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టేందుకు క్రమక్షశిణ కలిగిన ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్నానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది నా నిబద్ధత. కులగణన.. నా కోసం, నా పదవి కోసం చేయలేదు. త్యాగానికి సిద్ధపడే.. కులాల లెక్కలు పక్కాగా తేల్చాం అని స్పష్టం చేశారు. మా నాయకుడి ఆదర్శం నిలబెట్టేందుకు నేను కార్యకర్తగా మిగిలేందుకు సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్వేగంగా అన్నారు.కొందరు ఆరోపిస్తున్నట్టు కులగణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగలేదన్నారు. ఇప్పుడు కులగణన సర్వేను తప్పు పడితే బీసీలు శాశ్వతంగా నష్టపోతారు. దేశం మొత్తం కూడా కులగణన సర్వే జరగాలని పార్లమెంట్‌లో మోదీని రాహుల్‌గాంధీ నిలదీశారని గుర్తు చేశారు. ఈ సర్వే జరగకూడదని మోదీ, కేసీఆర్ కలిసి కుట్ర చేస్తున్నారు. నరేంద్రమోదీ పుట్టుకతో బీసీ కులస్థుడు కాదు. గుజరాత్ సీఎం అయ్యాక ఆయన కులాన్ని బీసీ జాబితాలో చేర్చుకున్నారు. సర్టిఫికెట్ ప్రకారం మాత్రమే మోదీ బీసీ వ్యక్తి.. ఆయన వ్యక్తిత్వం మాత్రం అగ్ర కులం. కులగణన జరిగితే చట్ట ప్రకారం రిజర్వేషన్లు సాధించుకోవచ్చు. అధికారిక లెక్కలు ఉంటే బీసీల రిజర్వేషన్లు పెంచాలని సుప్రీంకోర్టు కూడా చెప్పొచ్చన్నారు. కులగణన సర్వే రెండో విడత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఇంటి ముందు మేలుకొలుపు డప్పు కొట్టాలని బీసీ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా. సర్వేలో పాల్గొనకపోతే సామాజిక బహిష్కరణే శిక్ష' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణనకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కేంద్రం జన గణనతో పాటు కులగణన చెయ్యాలి. అప్పుడు కేంద్ర లెక్కలు, మా ప్రభుత్వ లెక్కలను సరిపోల్చి చూద్దామని సవాల్ విసిరారు. కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీష్‌లను బహిష్కరణ చెయ్యాలి.. బహిష్కరణ కోసం మీ సమక్షంలో తీర్మానం చేస్తున్నానని అన్నారు. ప్రభుత్వ సర్వే తప్పుల తడక అని బీఆర్ఎస్ చెప్పే ప్రయత్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనం కుల గణన విజయవంతంగా నిర్వహించడంతో ప్రధాని మోడీపై ఒత్తిడి వస్తుందనే భయంతో మన సర్వేను తప్పుడు సర్వే అని బీజేపీ వాళ్లు అంటున్నారని ఫైర్ అయ్యారు. సర్వేలో ఎక్కడ తప్పు ఉందో



చెప్పాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులను బీసీలు నిలదీయాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు వింటే బీసీలకు తీరని నష్టం జరుగుతోందన్నారు.

## కాంగ్రెస్ బలం.. బలగం
# అంతా యూత్ కాంగ్రెస్సే

- చంద్రబాబు, కెసిఆర్ మూలాలు యూత్ కాంగ్రెస్ నుంచే
- తెలంగానలో అధికారంలోకి రావడంతో యూత్ కృషి
- కష్టపడి పనిచేస్తే పదవులు అవే వస్తాయి
- యూత్ కాంగ్రెస్ నేతల బాధ్యత స్వీకరణలో సిఎం రేవంత్



**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్‌పై ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు, కెసిఆర్ లాంటి వారంతా యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన యువజన కాంగ్రెస్ నేతల ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారని.. వీరితో పాటు పార్టీలోని అగ్ర నాయకులు అంతా యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని.. అది యూత్ కాంగ్రెస్‌కు ఉన్న పవర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ బలం, బలగమని.. యూత్ కాంగ్రెస్ శక్తి ఏమిటో మాకు తెలుసని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మిట్టపలి వెంకటేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టపడి పని చేస్తే పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని.. అనిల్ యాదవ్, బల్మూరి వెంకటే ఇందుకు నిదర్శమని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వీరిద్దరికి పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. కొందరు పదవులు రావడం లేదని నిరాశ చెందుతున్నారు.. టైమ్ వచ్చినప్పుడు అవకాశాలు వస్తాయి.. ఎవరూ పోరాటం ఆపొద్దని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయనంత రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసి చూపించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం.. భూమి లేని వ్యవసాయ కూలీలకు రైతు ఆత్మీయ భరోసా కింద ర.12 వేలు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవం కోసం ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్ పేరుతో కేసీఆర్ ఊరించి మోసం చేశారని.. ఆయన మోసం చేశారు కాబట్టే ప్రజలు మనకు అధికారం ఇచ్చారని అన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని.. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ దేనని అన్నారు. మాకు పాలనే సరిపోతుందని.. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మీరే తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు పదవి ఇస్తామన్నారు.

డబ్బులతోనే గెలిచే అవకాశం ఉంటే.. కేసీఆర్ 100 సీట్లు గెలిచే వారని.. సొమ్ముతోనే ఎన్నికల్లో గెలుస్తామనే భ్రమ వీడండని సూచించారు. ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడండని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పోరాడిన అందరికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇస్తామన్నారు. '37 కార్పొరేషన్లకు ఛైర్మన్లు, అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించాం. ప్రతి పేదవాడు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఇస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్‌పై ఉంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ఎక్కువగా పాల్గొనాలి. పార్టీలో కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుంది. పైసలు ఉంటే ఎన్నికల్లో గెలవరు.. ప్రజాబలం ఉంటేనే గెలుస్తారు. పార్టీ కోసం కష్టపడకుండా కేవలం నాయకుల చుట్టూ తిరిగితే మాత్రం పదవులు ఉండవు. కేవలం డబ్బులతోనే రాజకీయాల్లో విజయం సాధిస్తామని అనుకోవద్దు. గల్లీ నుంచి పోరాడితేనే దిల్లీ వరకు ఎదిగే అవకాశం వస్తుంది' అని సీఎం అన్నారు.

## వేలకోట్లు ఎగవేస్తున్న వారి నుంచి
# రికవరీ చేశారా: తుమ్మల

మొదటి పేజీ తరువాయి



వేలకోట్లు ఎగవేసిన వారి నుంచి రికవరీ ఎలా చేస్తున్నారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం హైదారబాద్‌లో నాబార్డ్ స్టేట్ క్రెడిట్ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు తుమ్మల నాగేశ్వరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమం వేదికగా నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్‌ను మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సామాన్యుల పట్ల వ్యవహరిస్తున్న తీరు కారణంగా ప్రజల్లో ఆగ్రహం రాగలదన్నారు. ఇలాంటి చర్యలు సరికావని బ్యాంకర్లకు ఆయన చురకలంటించారు. రుణం తీర్చలేదని రైతు ఇంటి గేటును బ్యాంకర్లు తీసుకెళ్లినట్లు పేపర్లో చూశానని ఆయన పేర్కొన్నారు. అయితే మరి వేలకోట్లు రూపాయిలు బ్యాంకుల్లో అప్పుగా తీసుకొని.. ఆ రుణాన్ని చెల్లించని వారిని ఏం చేస్తున్నారని ప్రజలు తమను నిలదీస్తున్నారని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అలాంటి వారి వద్ద నుంచి నగదును ఎందుకు రికవరీ చేయలేక పోతున్నారని ఈ వేదిక మీద నుంచి బ్యాంకర్లను సూటిగా తుమ్మల ప్రశ్నించారు. బ్యాంకింగ్ రంగం.. వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే బ్యాంకులకు వచ్చే రైతులను గౌరవించాలని బ్యాంకర్లను ఆయన కోరారు.రైతలంటే అడుక్కునే వారు.. బ్యాంకులంటే ఇచ్చే వారు అనే భావనతో ఉండ వద్దని బ్యాంకర్లకు ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. రైతులంటే ఈ వ్యవస్థను రక్షించేవారని మంత్రి తుమ్మల అభివర్ణించారు. అయినా రైతులకు బ్యాంకులు ఇచ్చిన లోన్ ఎంత.. అందులో వారు ఎగ్గొట్టింది ఎంత శాతమని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. బ్యాంకులు ఇచ్చిన వ్యవసాయేతర రుణం ఎంత వాళ్లు ఎగ్గొట్టింది ఎంత ఒక్కసారి పరిశీలన చేసుకోవాలని బ్యాంకర్లకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకర్లు మరింత సహకరించాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాల్సిన అవసరాన్ని బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్లారు. పశుపోషణ, మత్స్యపరిశ్రమ, కృషి ఆధారిత పరిశ్రమలు వంటి రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, పోషకాహార భద్రతను మెరుగుపరచడం కోసం చిరుధాన్యాల సాగు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల అన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, నాబార్డ్ ప్రతినిధులు, బ్యాంకింగ్ రంగ ప్రముఖులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటుపై కీలక నిర్ణయం

### విద్యాశాఖకు సీఎం ఆదేశాలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 14 :** యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో శుక్రవారం విద్యాశాఖ అధికారులతో రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ నియోజకవర్గంలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ స్థలాల సేకరణ, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంద నియోజవర్గాల్లో నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గాల్లో స్థలాల కేటాయింపుల్లో పూర్తయిన వాటికి అనుమతులకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత స్థలాలు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. అనువైన స్థలం లేని చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించాలని సూచించారు. కలెక్టర్లు ఫీల్డ్ విజిట్ చేసి వీలైనంత త్వరగా స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి స్థలాల గుర్తింపు ప్రక్రియకు సంబంధించి వారం రోజుల్లో రిపోర్ట్ అందించాలని చెప్పారు. ఇప్పటికే స్థల సేకరణ జరిగిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండేళ్లలో 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో వందశాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో ఆ స్థాయి ప్రమాణాలతో సరైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్లే గ్రౌండ్, అకాడమిక్ బ్లాక్, ఇతర సౌకర్యాలను భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముగిసిన స్పష్టం చేశారు.

# చర్చకు వస్తారా?



**సంగారెడ్డి, ఫిబ్రవరి 14 :** తెలంగాణలో అప్పులతో ప్రభుత్వం నడుస్తోందని, అప్పులు లేనిదే కదలలేని స్థితికి చేరిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మార్పు రావాలని కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా పూర్తిగా వైఫల్యం అయిందని విమర్శించారు. పదేళ్ళలో బీఆర్ఎస్ పై వ్యతిరేకత వస్తే కాంగ్రెస్ పార్టీపై పది నెలల్లోనే వ్యతిరేకత పెరిగిందన్నారు. తెలంగాణ మొత్తం కల్వకుంట్ల కుటుంబం చుట్టూ తిరిగేలా పదేళ్లు పరిపాలన చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. 'రాష్ట్రంలో మార్పు రాలేదు... మారింది సీఎం, పార్టీ జెండా మాత్రమే.. పరిపాలన మాత్రం అలానే ఉందని అన్నారు. బీజేపీ మాత్రమే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ అభ్యర్థులు గేలిస్తే ప్రశ్నించే గొంతుకగా శాసనమండలిలో ఉంటారన్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనమండలిని నిర్వీర్యం చేసిందని వ్యాఖ్యలు చేశారు. అసలు శాసనమండలి ఉందా లేదా అన్న అనుమానం కలిగేటట్టు బీఆర్ఎస్ వ్యవహరించిందన్నారు. హైదరాబాద్‌లో నిరుద్యోగుల వద్దకు వచ్చి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కేంద్రం పీఆర్సీ ప్రకటించినా రాష్ఠంలో మాత్రం ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. రాబోయే రోజుల్లో కొత్త ఇంటర్నేషనల్ స్కూల్ మాట దేవుడేరుగు ఉన్న స్కూళ్లకు రంగులు వేయలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్, బీఆర్ఎస్ దెబ్బతీశాయని దుయ్యబట్టారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్క్, కరీంనగర్ యూరియా ఫ్యాక్టరీ, ఎన్‌టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి అంతా బీజేపీ హయాం లోనే జరిగిందని తెలిపారు. రైతులకు సబ్సిడీతో ఎరువులు అందిస్తున్నది మోడీ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ల్గ÷తులకు గిట్టుబాటు ధర కల్పించింది మోడీ అని అన్నారు. 2014లో మోడీ ప్రధాని కాక ముందు 3 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పుడు 26 వేల కోట్లతో తెలంగాణ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. 'కేంద్రం ఏం చేసింది అంటూ మాట్లాడుతున్నారు. కేసీఆర్, రేవంత్ కలిసి వస్తే రండి. పదేళ్ళలో మోడీ ప్రభుత్వం ఏం చేసిందో చూపిస్తాం. గ్రామ పంచాయితీలకు రాష్టం నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. హరీష్ రావు, కేటీఆర్ కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా' అంటూ సవాల్ విసిరారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి ప్రధాని మోడీ వస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకున్నారని మండిపడ్డారు. రాబోవు అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుండు సున్నా మాత్రమే వస్తుందన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమన్నారు. తెలంగాణలో అధికారంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే అంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను మీడియాకి వివరించారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే కాంగ్రెస్ అరాచకాలను మండలిలో ప్రస్తావించి ఎండగడతాం అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పాటు పడతారని అన్నారు. మీడియా సమావేశంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు గారు, ఓఒఅ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్కా కొమురయ్య, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాజేశ్వర్ రావు దేశ్ పాండే, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మరో లగచర్ల చేయొద్దు

**దంపుయార్డుతో కాలుష్యాన్ని నెత్తిన వేయకండి**

**గుమ్మడిదలలో నిరసనకు హరీష్ రావు సంఘీభావం**



**సంగారెడ్డి, ఫిబ్రవరి 14:** గుమ్మడిదలను మరో లగచర్ల చేయవద్దని మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. ఇక్కడ డంప్‌యార్డు ఏర్పాటును ఉపసహంరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీరుపై హరీష్ రావు మండిపడ్డారు. జీహెచ్ఎంసీ డంప్‌యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం గుమ్మడిదలలో గత కొన్ని రోజులుగా స్థానికులు చేస్తున్న ఆందోళనకు మాజీ మంత్రి మద్దతు తెలుపుతూ.. సంఘీభావంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు తెచ్చి మా నెత్తిన వేయకండి అంటే మొండిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. పర్యావరణం దెబ్బతింటదని, నర్సాపూర్ చెరువు కలుషితం అవుతుందని.. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయనే వద్దు అంటే పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు గతంలోనే ఈ పనులను ఆపామని చెప్పుకొచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వెళ్తోందన్నారు. రేవంత్ రెడ్డి ఎమ్జ్గ÷న్సీ లెక్క చేస్తున్నారని విమర్శించారు. వందల మందిని ఎత్తుకొని పోయి పోలీసు స్టేషన్లలో పెడుతున్నారని.. రాత్రికి రాత్రి పనులు చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి దుర్మార్గంగా ప్రవర్తించడం సరికాదన్నారు. గుమ్మడిదల రైతులు అందరికీ ఆదర్శమని.. బంగారం వంటి పంటలు పండిస్తారని తెలిపారు. తక్షణమే డంపు యార్డు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వచ్చాక లగచర్ల బూములు గుంజుకున్నారని..న్యాల్కల్‌లో పచ్చటి పొలాలు గుంజుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గుమ్మడిదలను మరో లగచర్ల చేయకండని రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యం అన్నారని.. ఇందిరమ్మ కాలం నాటి ఎమ్జ్గ÷న్సీని తలపిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ఊళ్లలో మంది ఎంత మంది ఉంటే అంత మంది పోలీసులను పెట్టారని.. ఓట్లేసిన పాపానికి ప్రజలను మోసం చేశారంటూ మండిపడ్డారు. రుణమాఫీ, రైతు బందు, మహాలక్ష్మి, ఇలా అన్నీ మోసమే అని అన్నారు. గుమ్మడిదల రైతుల కోరిక మేరకు డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పకుండా అసెంబ్లీ వేదికగా గుమ్మడిదల ప్రజల తరపున పోరాటం చేస్తామని... ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తామన్నారు. ఎయిర్ ఫోర్స్ వాళ్లు కూడా ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని.. అయినా పట్టించుకోవడం లేదన్నారు. టిప్పర్లు, పోలీసులను వెనక్కి తీసుకోవాలని.. ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కళ్లు తెరవకుంటే తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. చేతిలో అధికారం ఉందని బలవంతంగా పని చేయవద్దన్నారు. రెండు సార్లు హైకోర్టు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పనులు ఆపాలని, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌లను హెచ్చరిస్తున్నామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

# మతిస్తిమితం కోల్పోయిన కేటీఆర్

**అభివృద్ధిని చూసి ఓర్వలేక తరచూ విమర్శలు**

**జూదాలకు నిలయంగా తెలంగాణను మార్చారు**

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శలు**

నిజామాబాద్, ఫిబ్రవరి 14: కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కేటీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ కు దమ్ము, ధైర్యం ఉంటే సిరిసిల్లలో రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డిని రాజీనామా చేయాలనడం హాస్యాస్పదమన్నారు. సోషల్ మీడియా, పింక్ మీడియాను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఎవరేం చేసినా మళ్లీ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం ఎలా నడస్తుందో చూస్తానని కెటిఆర్ అనడం సరైనది కాదు సూచించారు. ప్రభుత్వాన్ని ఎలా నడపాలో తమకు తెలుసన్నారు. 60 వేల కోట్లు ఉన్న అప్పులను 6 లక్షల కోట్లకు తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమాజాన్ని మద్యానికి బానిసలుగా చేశారని చెప్పారు.తెలంగాణను క్యాసినో హబ్‌గా కెటిఆర్ మార్చారని ఆరోపించారు. ఆధునిక హంగులతో విదేశాల్లో ఆడే క్యాసినో, జూదాలు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌస్‌లో జరగడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. కెటిఆర్ బావమరిది ఇంట్లో ఓ పార్టీలో కొకైన్ పట్టుబడిందని ఆయన గుర్తు చేశారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌస్‌లో జరుగుతున్న అక్రమాలకు ముమ్మాటికీ బాధ్యుడు కెటిఆర్ అని ఆయన ఆరోపించారు. దొంగలకు లీజుకు ఇస్తే వాళ్ళు దొంగలే అవుతారన్నారు. ఇక పోలీసుల అండర్ కవర్ ఆపరేషన్‌లో భాగంగా పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌస్ గుట్టు బయట పడిందన్నారు. కెసిఆర్ కుటుంబంలో నలుగురు వాళ్ల కోసం మాత్రమే పోరాటం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. బిఆర్ఎస్ హయంలో ఇచ్చిన పర్మిషన్‌తో రెండేళ్ల నుంచి ఈ పందెలు జరుగుతున్నాయన్నారు. పది మంది ఎమ్మెల్యేలు ఎందుకో పార్టీ ఫిరాయించారో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలన్నారు. హీరో కావడానికి కెటిఆర్ జీరో పనులు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

# సమగ్ర తెలంగాణ ఉద్యమం చరిత్ర రావాలి

- **ఎందరో ప్రాణ త్యాగాలు చేసినా..ఒక్కరే చేసినట్లు ప్రచారం**
- **దేవందర్ గౌడ్ విజయ తెలంగాణ పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్**



**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** తెలంగాణ ఉద్యమ చరిత్రపై సమగ్రమైన పుస్తకాలు రావాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ రచించిన 'విజయ తెలంగాణ' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ జలవిహార్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా సీఎం హాజరయ్యారు. 'తెలంగాణ ఉద్యమంపై లోతైన చర్చ జరగాల్సి ఉందన్నారు. ఉద్యమంలో ఎన్నో వర్గాలు పాల్గొన్నా.. ఒక కుటుంబమే పాల్గొన్నట్టు వక్రీకరించారు. దేవేందర్‌గౌడ్ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నారు. తన రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్నారు. గోదావరి జలాలు తెలంగాణలో పారించేందుకు ఆయన ఉద్యమం చేపట్టారు. దేవేందర్‌గౌడ్ పాదయాత్ర వల్లే ఆనాడు ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టింది. ఉద్యమం సమయంలో ప్రజలంతా టీజీ అని వాహనాలు, బోర్డులు, గుండెల మీద రాసుకున్నారు. ప్రజలు కోరుకున్న విధంగానే ఇప్పుడు టీఎస్‌ను టీజీగా మార్చాం అని సీఎం వివరించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో తెలంగాణ అంటే షార్ట్ కట్‌లో 'టీజీ' అని మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ గుండెల మీద రాసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ అంటే టీజీ కాకుండా టీఎస్‌గా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందని.. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు గుర్తుగా టీఎస్‌ను కాస్తా టీజీగా మార్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. టీఎస్‌ను టీజీగా మార్చాలని అనుకున్నప్పుడు దేవేందర్ గౌడే గుర్తొచ్చారు. ఉద్యమంలో టీజీని గోడలపైనే కాదు.. గుండెల మీద రాసుకున్న వ్యక్తి దేవేందర్ గౌడ్' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంపై చర్చ లోతుగా జరగాలి. ఉద్యమ చరిత్రపై సమగ్రమైన పుస్తకాలు రావాలన్నారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధనలో కేవలం ఒక్క కుటుంబమే పాల్గొన్నట్లు చరిత్ర వక్రీకరించారు. కానీ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో వర్గాలు పాల్గొన్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన జయజయహే తెలంగాణ పదేళ్లు నివురుగప్పిన నిప్పులా ఉందని.. మేం అధికారంలోకి రాగానే జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా మార్చామని గుర్తు రేవంత్ రెడ్డి చేశారు. కార్యక్రమంలో హిమాచల్ గవర్నర్ దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో ఇమడలేక పోతున్నా

**బీజేపీకి రాజీనామా చేసేందుకు రెడీ**

**ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 14 :** బిజెపిలో ఇమడలేక పోతున్నానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి రాజీనామా చేసేందుకు రెడీగా ఉన్నట్లు కూడా ప్రకటించారు. పార్టీలో వేధింపులు తట్టుకోలేక పోతున్నానని, అవసరం లేదని క్లారిటీ ఇస్తే ప్రాథమిక సభ్యత్వాన్నీ వదులుకునేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. గోల్కొండ, గోషామహల్ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని తాను సూచించిన బీసీ నాయకుడికి కాకుండా ఎంఐఎం లీడర్ల వెంట తిరిగే వ్యక్తికి ఇచ్చారంటూ మండిపడ్డారు. '2014లో భారతీయ జనతా పార్టీలో నేను చేరినప్పటి నుంచి వేధింపులు భరిస్తున్నా.. ఇక నా వల్ల కావడం లేదు.. పార్టీకి నా అవసరం లేదు.. వెళ్లిపో అని అంటే ఇప్పటికిప్పుడే వెళ్లిపోవడానికి సిద్ధం.. గోల్కొండ జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీ లేదా బీసీకి ఇవ్వాలని నేను సూచించాను.. కానీ, ఎంఐఎంతో సంబంధాలు కొనసాగించే వ్యక్తిని నియమించారు. ఇదేంటని పార్టీకి చెందిన కీలక నేతకు ఫోన్ చేసి అడిగితే ఆ విషయం తనకు తెలియదని సమాధానం చెప్పారు.. ఆ జవాబుతో నా వెనుక జరుగుతున్న కుట్ర కోణం బయట పడింది. నేను ఇప్పటి వరకు బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్‌లతోనే పోరాటం చేస్తూ వచ్చాను. కానీ, సొంత పార్టీలోనూ యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఎదుర్కోవడం దురదృష్టకరం.. జిల్లా అధ్యక్ష పదవి అనేది పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ సూచించిన వ్యక్తికి ఇవ్వడం ప్రతి చోటా జరుగుతుంది. కానీ, ఇక్కడ నా సూచన ఎందుకు పక్కన పెట్టాల్సి వచ్చింది. దీనిపై సంజాయిషీ ఇవ్వాలి. వెంటనే అధ్యక్షుడిని మార్చాలి. జీవితంలో నేను ధర్మ ప్రచారం, ధర్మ యుద్ధం నేర్చుకున్నా. ప్రస్తుతం పార్టీలో కొందరిలా బ్రోకరిజం నేను నేర్చుకోలేదు. వాళ్ల కారణంగా ఈ రోజు పార్టీ వెనుకబడింది. రాష్ట్రంలో ఎప్పుడో బీజేపీ ప్రభుత్వం రావాలి. కానీ ఇలాంటి రిటైరైన వ్యక్తులు ఉంటే బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాదు' అంటూ వ్యాఖ్యానించారు. రాజాసింగ్ కామెంట్స్ బీజేపీలో హాట్ టాపిక్ గా మారాయి. బీజేపీ ఇటీవలే 19 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా మరో నాలుగు జిల్లాలకు ప్రెసిడెంట్లను ప్రకటించింది. గోల్కొండ గోషామహల్ జిల్లా అధ్యక్షుడిగా ఉమా మహేంద్ర, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా సీ గోదావరి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ఊటుకూరు అశోక్ గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వల్లభు వెంకటేశ్వర్లు పేర్లను కేటాయించింది. గోల్కొండ జిల్లా అధ్యక్షుడిగా ఉమామహేంద్రను నియమించడంపై రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధ్యక్షుడిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో ప్రమాదం

**ఆరుగురికి గాయాలు.. హైదరాబాద్ తరలింపు**

**నల్లగొండ, ఫిబ్రవరి 14:** జిల్లాలోని దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగింది. రోజువారి విధుల్లో భాగంగా శుక్రవారం ప్లాంట్‌లో బూడిద యంత్రాన్ని క్లీన్ చేస్తుండగా వేడి బూడిద కార్మికులపై పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గాయపడ్డ కార్మికులను హైదరాబాద్‌కు తరలించారు. వేడి బూడిద మీద పడటంతో కార్మికులు చేసిన ఆర్తనాదాలతో ప్లాంట్ దద్దరిల్లింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో గాయపడ్డ కార్మికులు ఎవరు..? అసలు ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై ప్లాంట్ అధికారులు ఆరా తీస్తున్నారు.

# నాణ్యతలేని చికెన్

**చికెన్ షాపుల్లో భారీగా కుళ్లిన చికెన్**

**500 క్వింటాళ్లకు పైగా సీజ్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 14 :** బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాపిస్తోండటంతో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. ఈ నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. నాణ్యతగా లేని చికెన్ అమ్మకాలు చేస్తున్న వ్యాపారులపై కొరడా ఝుళిపించారు.. పలుమార్లు హెచ్చరించినప్పటికీ వ్యాపారుల ధోరణి మారకపోవడంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. రసూల్‌పురలోని అన్నానగర్‌లో చికెన్ షాపుల్లో అధికారులు సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పలు చికెన్ షాపుల్లో కుళ్లిన చికెన్ భారీగా బయటపడింది. సుమారుగా 500 క్వింటాలకు పైగా కుళ్లిన చికెన్‌ను అధికారులు సీజ్ చేశారు. కుళ్లిన చికెన్ భారీగా బయటపడటం చూసి షాకుకు గురయ్యారు. ఇది వివిధ సెంటర్లకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కనుక్కోన్నారు. వైన్ షాపులు, బార్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు తక్కువ ధరలకు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. మూడు నెలల పాటు కెమికల్స్ కలిపి కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచుతున్నట్లు వెల్లడించారు. చికెన్ పాడవకుండా ప్రమాదకరమైన ఫార్మలిన్ కలుపుతున్నట్లు నిర్ధారించారు. బర్డ్ ఫ్లూ వైరస్ కంటే ప్రమాదకరమైన కెమికల్స్ కలుస్తున్నాయంటూ అధికారులు గుర్తించారు. గతంలో ఇదే షాపుల్లో భారీగా కుళ్లిన చికెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టికున్నారు. చికెన్ షాపుల లైసెన్సు రద్దు చేశారు. వ్యాపారులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసు నమోదు చేశారు. కుళ్లిన చికెన్ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. బర్డ్ ఫ్లూ వైరస్ సహజంగా జంతువులు, పక్షుల నుంచి మనుషులకు సోకుతుంది. అధికంగా కోళ్ల నుంచి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి బర్డ్ ఫ్లూ బారినపడ్డ జంతువులు, పక్షులకు దగ్గరగా ఎక్కువసేపు ఉన్నా కూడా బర్డ్ ఫ్లూ వస్తుంది. ఈ వ్యాధి సోకిన కోళ్లను తిన్నా మనుషులకు వ్యాపించే అవకాశాలున్నాయి. చికెన్‌ను బాగా శుభ్రం చేసి ఉడికించడం ద్వారా అందులోని వైరస్ చనిపోతుంది. ఉడికీ ఉడకని చికెన్ తినడం వల్ల ఇది మనుషులకు వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే ప్రస్తుతం బర్డ్ ఫ్లూ వ్యాప్తి ఎక్కువగా ఉండటంతో చికెన్ తినకపోవడమే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



# జనాభాకు తగ్గట్లుగా వస్తూత్పత్తి ఏదీ?!

ద్రవ్యోల్బణం అరికట్టడానికి...దిగుమతులపై సుంకాలు తగ్గేలా చేయడానికి ముందుగా మన విదేశాంగ విధానం సమీక్షించుకోవాలి. దేశంలో వస్తూత్పత్తి పెరిగేలా చేసుకోవడంలో మనం చైనా నుంచి నేర్చుకోవాలి. వియత్నాం, క్యూబా, కొరియా లాంటి దేశాలు కూడా ప్రపంచంతో పోటీపడగలిగేలా వస్తూత్పత్తిలో ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికీ మనం ఎలక్ట్రానిక్ గూడ్స్ విషయంలో ప్రపంచ దేశాలపైనే ఆధారపడి ఉన్నాం. గూగుల్ సిఇవో, మైక్రోసాఫ్ట్ సిఇవోలు మనవారే ఉన్నా..ఈ రంగంలో మనం అంతగా రాణించడం లేదు. దేశీయంగా మన ఉత్పత్తులను పెంచుకుని మనం సుంకాలు విధించే స్థితిలో ఉంటే..అవి ప్రపంచ దేశాలకు అవసరమైతే మన డిమాండ్ పెరుగుతుంది. మేకిన్ ఇండియా, ఓకల్ ఫర్ లోకల్ వంటి నినాదాలు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదు. దేశంలో మానవవనరులు విపరీతంగా ఉన్నాయి. జనాభా 140 కోట్లు దాటి చైనాను మించి పోయాం. చైనా లాగా వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో మనం ముందుకు పోవాలి. అందుకు అనుగుణంగా నిర్ణయాలు, ప్రోత్సాహకాలు అసవరం. మనదగ్గర పండే పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు, ఎగుమతులు చేసుకునేలా సరళీకరణ విధానాలు రావాలి. అప్పుడే బియ్యం, మిర్చి, పత్తి వంటివి ఎగుమతి కాగలవు. అలా మన వస్తువులకు సుంకాలను మనమే విధించగలం. ఇప్పుడు అమెరికా సుంకాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మనకు అవసరమున్న వస్తువులనే దిగుమతి చేసుకుంటే సుంకాల బాధతో పాటు, విదేశీమారకం బాధ తప్పుతుంది. కానీ దేశంలో ఇన్నేళ్లయినా ఈ విషయంలో మనం స్పష్టతతో లేమా అన్న అనుమానం కలుగుతోంది. అందుకే విదేశాలు ముఖ్యంగా అమెరికా లాంటి దేశాలు తీసుకునే నిర్ణయాలతో మన ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతున్నాం. చైనాలో అలాంటి పరిస్థితి మాత్రం కానరావడం లేదు. అందుకే అమెరికా అధ్యక్షుడిగా గెలిచిన డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో మన దేశంలోని సామాన్యులందరిపై ప్రభావం పడుతున్నది. సుంకాలు పెంచుతామని హెచ్చరించారు. ఇటీవల ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలతో డాలర్ క్రమంగాబలపడుతున్నది.అదే క్రమంలో మన రూపాయి మరింత బలహీన పడుతోంది. విదేశీ ఇన్వెస్టర్లు ఇండియా నుంచి వేల కోట్లను యూఎస్‌కు తరలించుకుపోతుండడంతో మన స్టాక్‌మార్కెట్లు కుదేలవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్రమంగా పతనమై.. మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల రేట్లు పెరుగు తున్నాయి. దీంతో విదేశీ మరకాల నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా చమురు ధరలు పెరగడం వల్ల నిత్యావసరాల రేట్లు పైకి ఎగబాకుతున్నాయి. ఇలాంటి గందరగోళ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు గోల్డ్ వైపు చూస్తుండడంతో వాటి రేట్లు సైతం అనూహ్యంగా అందనంతగా పెరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే త్వరలోనే డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.100కు, గోల్డ్‌రేట్‌రూ.లక్షకు చేరుతుందని.. దీని వల్ల మనదేశంలోని సామాన్యులపై మరింత భారం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే బంగారం ధరలు చుక్కలు చూపుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రోజురోజుకూ పతన మవుతున్నది. ఇటీవలి కాలంలో వేగంగా పడిపోతున్న రూపాయి మారకం విలువ ఫిబ్రవరి 5న 87.38 ఆల్ టైమ్ కనిష్టానికి చేరింది. గతేడాది నవంబర్6న అమెరికా ఎన్నికల్లో ట్రంప్‌విజయం సాధించడంతో డాలర్ బలపడుత్తూ వస్తున్నది. ఇది రూపాయి విలువపై ప్రభావం చూపుతున్నది. నవంబర్ 5న డాలర్‌తో పోలిస్తే రూ.84.16 గా ఉన్న రూపాయి విలువ క్రమంగా తగ్గుతూ డిసెంబర్19న 85 మార్క్ చేరింది. ట్రంప్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు స్వీకరించాక దూకుడుగా తీసుకుంటున్న పలు నిర్ణయాలతో కేవలం నెలన్నర వ్యవధిలో డాలర్‌విలువ 2 రూపాయల మేర పెరిగింది. ఇటీవల ట్రంప్.. కెనడా, మెక్సికో దేశాల వస్తువులపై 25 శాతం, చైనా వస్తువులపై 10 శాతం దిగుమతి సుంకం విధించారు. దీంతో అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు నెలకొని డాలర్ బలపడుతుండగా, డాలర్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉన్న ఆసియా కరెన్సీలు పతనం అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ రాణిస్తుండడం, అక్కడ బాండ్లపై మంచి రిటర్న్స్ వస్తుండటంతో మన దగ్గర విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్తున్నాయి. మన స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్లు జనవరి నుంచి ఇప్పటివరకు రూ.68,441 కోట్లకు పైగా వెనక్కి పట్టుకు పోయారు. దీని వల్ల స్టాక్ మార్కెట్లు కుదేలవుతూ లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోతోంది. డాలర్లకు డిమాండ్ పెరిగి, రూపాయి బలహీనపడుతోంది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు దారుణంగా పెరిగిపోతున్నాయి. దీంతో దిగుమతులు ఖరీదవుతున్నాయి. మరోపక్క ద్రవ్యోల్బణం పెరగడంతో కార్పొరేట్ సంస్థల ఆదాయాలు, లాభాలు తగ్గుతున్నాయి. ఆర్థిక కార్యకలాపాలు మందగించి, ఉద్యోగాల్లో కోత, సరకుల సరఫరా తగ్గడం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. అటు విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు, ఖర్చుల మొత్తం పెరిగి తల్లిదండ్రులు తల పట్టుకుంటున్నారు. ద్రవ్యోల్బణం పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించడంతో ముమ్ముందు నిత్యావసరాల ధరలు మరింత పెరుగుతాయనే భయాందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో దేశీయంగా మానవవనులను ఉపయోగించుకోవాలి. ఏదో ఒకపనిద్వారా ప్రపంచానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తిపై దృష్టి సారించాలి. దీంతో నిరుద్యోగం నిర్మూలించడంతో పాటు, వస్తూత్పత్తి పెరిగి, అంతర్జాతీయ మార్కెట్‌లో నిలదొక్కుకోగలం.

# పెళ్లిళ్లపై బంగారం ధరల ప్రభావం

**రోజురోజుకూ పెరుగుదలతో ఆందోళన**

**ధరలను అందుకోలేక పోతున్న సామాన్యులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి14 :** అసలే మాఘమాసం కావడంతో తెలుగు రాష్ట్రాల్లో మార్చి 26 దాకా లక్షలాది పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో పెరిగిన బంగారం రేట్లను చూసి ఆడపిల్లల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. క్రమంగా బంగారం ధరలు పెరుగుతూ హడలెత్తిస్తున్నాయి. పుస్తెలు చేయించడాని కే మూర్చ వచ్చేంతగా ధరలు పెరుగుతున్నాయి. 22 క్యారెట్ల బంగారం ధర దాదాపు 80వేలకు చేరువలో ఉంది. వెండి ధర కిలోపై రూ.వెయ్యి పెరిగి రూ. లక్షా 7 వేలుగా నమోదైంది. ఎన్నడూ లేని విధంగా రూ.86 వేలు దాటిన బంగారం ధరలను చూసి అందరూ షాక్ కు గురవుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో జనవరి 1న 24 క్యారెట్ల బంగారం రూ.78వేలు, 22 క్యారెట్ల బంగారం రూ.71,500 పలికింది. నెల వ్యవధిలోనే బంగారం ధర రూ.8వేలకు పైగా పెరగడం గమనార్హం. అమెరికాలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక యూఎస్ డాలర్ బలపడ్తున్నది. విదేశీ ఇన్వెస్టర్లు ఇండియాలో తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటుండడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఫలితంగా దేశీయ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెడ్తుండడం వల్లే గోల్డ్ రేట్లు పెరుగుతున్నాయని నిపుణులు చెప్తున్నారు. ముమ్ముందు 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష దాటడం ఖాయమని అంచనా వేస్తున్నారు. పెళ్లిళ్ల సమయంలో బంగారం రేట్లు అనూహ్యంగా పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. నిజానికి జనవరి 30న మాఘమాసం ప్రారంభమైంది. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 26 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది పెళ్లిళ్లు, గృహప్రవేశాలు జరగనున్నాయి. తెలుగిండ్లలో బంగారం లేకుండా పెళ్లిళ్లు జరగవంటే అతిశయోక్తి కాదు. ఆయా కుటుంబాలు తాహతును బట్టి పెళ్లి కూతుర్లకు, ఆడపడుచులకు తులాల కొద్దీ బంగారు ఆభరణాలు కొనడం ఆనవాయితీ. కానీ పెరిగిన బంగారం ధరలతో వధువుల తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. అలాగే పట్టుచీరలు, ఆహార పదార్థాలతో పాటు అన్ని వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

# అమెరికా, భారత్ ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం

## ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలు

- శాంతి చర్చలకు భారత్ మద్దతు
- అక్రమ వలసదారుల సమస్య అన్ని దేశాలది
- ట్రంప్‌తో భేటీ సందర్భంగా ప్రధాని మోడీ



**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** అమెరికాలో వైట్‌హౌస్‌లో భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్ మధ్య రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం కీలకమైన సమావేశం జరిగింది. ట్రంప్ అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ప్రధాని మోదీతో ఆయన మొదటిసారి సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాల వాణిజ్య సంబంధాలను పెంచడం, సుంకాల సవరణ, భవిష్యత్తులో భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై చర్చలు సాగాయి. ప్రధాని మోదీ మాట్లాడుతూ భారత్ ఎప్పటికీ శాంతి వైపే ఉంటుందని, శాంతి కోసం చేసే చర్యలకు మద్దతు ఇస్తున్నామని చెప్పారు. జాతీయ ప్రయోజనాలు, శాంతి కోసం చేసే ప్రయత్నాల విషయంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ క్రమంలో భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. భారత్, అమెరికా సుసంపన్న ప్రజాస్వామ్య దేశాలుగా నిలవాలని, మానవాళి సంక్షేమం కోసం కలిసి పనిచేస్తే, అది ప్రపంచానికి మంచి మార్గదర్శకత్వం అవుతుందని మోదీ అన్నారు. ఎలాన్ మస్క్‌తో మోదీ బేటీ. స్పేస్, టెక్నాలజీ, మొబిలిటీ, ఇన్నోవేషన్ వంటి రంగాలలో భారత్ చేసే సంస్కరణలు, గవర్నమెంట్, మాక్సిమమ్ గవర్నెన్స్ వైపుగా చేయగలిగే ప్రయత్నాల గురించి ఎలాన్ మస్క్‌తో చర్చించానని ప్రధాని మోదీ తెలిపారు. ప్రధాని మోదీ అక్రమ వలసదారులపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. అక్రమ వలసదారులకు దేశంలో ఉండే హక్కు రాదు. ఇది అంతర్జాతీయ సమస్య. ఏ దేశం అయినా తమ హోదాను పాటించాల్సి ఉంటుందని తెలిపారు. అమెరికాలో భారత రాయబార కార్యాలయాలను మరింత విస్తరించడానికి ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. మరిన్ని భారత రాయబార కార్యాలయాల విషయంలో లాస్‌ఏంజెల్స్, బోస్టన్ నగరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని ప్రధాని ప్రకటించారు. కాగా ప్రధాని మోదీతో పాటు ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ కూడా పాల్గొన్నారు. అమెరికా పర్యటనకు విచ్చేసిన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆత్మీయ ఆతిథ్యమిచ్చారు. అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో వీరిద్దరూ భేటీ అయ్యారు. ఈసందర్భంగా భారత ప్రధానికి ట్రంప్ ప్రత్యేక బహుమతి అందజేశారు. తాను స్వయంగా రాసిన 'అవర్ జర్నీ టుగెదర్' అనే పుస్తకాన్ని కానుకగా ఇచ్చారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చోటుచేసుకున్న కీలక సందర్భాలు, ప్రధాన ఈవెంట్లతో కూడిన ఫొటోబుక్ ఇది. ఇందులో ప్రధాని మోదీ 2019 నాటి అమెరికా పర్యటనలో నిర్వహించిన 'హౌడీ మోదీ', ఆ తర్వాత 2020లో ట్రంప్ భారత్‌కు విచ్చేసినప్పుడు ఏర్పాటుచేసిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు కూడా ఉన్నాయి. ఈ పుస్తకంపై 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, యూ ఆర్ గ్రేట్' అని రాసి ట్రంప్ సంతకం చేశారు. అనంతరం పుస్తకంలోని పేజీలను తిప్పుతూ వీరిద్దరూ ఉన్న ఫొటోలను మోదీకి ఆయన చూపించారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 'భారత ప్రధానికి ఆతిథ్యం ఇవ్వడం చాలా గౌరవంగా భావిస్తున్నా. చాలాకాలం నుంచి ఆయన నాకు గొప్ప స్నేహితుడు. మా మధ్య మంచి అనుబంధం ఉంది' అని కొనియాడారు. అటు మోదీ కూడా ఆయనపై ప్రశంసలు కురిపించారు. 'అమెరికా అధ్యక్షుడి నుంచి నేను నేర్చుకున్నది ఏంటంటే.. ఆయన దేశ ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యమిస్తారు. ఇది అభినందించదగ్గ విషయం. ఆయన లాగే నేను కూడా భారత ప్రయోజనాలకే అధిక ప్రాముఖ్యతనిస్తా' అని భారత ప్రధాని తెలిపారు. ట్రంప్‌తో భేటీ సందర్భంగా మోదీ పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఇరు దేశాల పరస్పర వాణిజ్య, రక్షణబంధం బలోపేతానికి కట్టుబడి ఉన్నట్లు దేశాధినేతలు తెలిపారు. అమెరికా పర్యటనను ముగించుకొని ప్రధాని మోదీ భారత్‌కు తిరుగుపయనమయ్యారు. భారత ప్రధాని మోదీని అద్భుతమైన నాయకత్వం ఉన్న వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. ఈ క్రమంలో భారత్‌కు మోదీ లాంటి నాయకుడు ఉండటం గర్వ కారణమని తెలిపారు. చాలా ఏళ్లుగా మోదీ తనకు గొప్ప స్నేహితుడన్న ట్రంప్.. ఆయనను కలవడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. భారత్‌తో మా స్నేహబంధం ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందన్నారు. త్వరలో భారత్‌తో ఒక భారీ వాణిజ్య ఒప్పందం జరగనుందని, భారత్, అమెరికా కలిసి పనిచేస్తే, ప్రపంచం ఒక గొప్ప శక్తిగా మారుతుందని వెల్లడించారు ట్రంప్. ఈ సందర్భంగా ట్రంప్ ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగించడానికి తన కృషి కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తాను శాంతి కోసం పనిచేస్తున్నానని, గత పాలకుల కారణంగా అమెరికా పాలన గాడి తప్పిందన్నారు. ఇప్పుడు అమెరికాను తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నానని ట్రంప్ అన్నారు.

# పెద్దగట్టు జాతరకు రంగం సిద్ధం

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- 16 నుంచి 20 వరకు జాతర



**సూర్యాపేట, ఫిబ్రవరి 14 :** రాష్ట్రంలో రెండో అతిపెద్దదైన పెద్దగట్టు జాతరకు రంగం సిద్ధం అయ్యింది. ఈనెల 16 నుంచి 20 వరకు పెద్దగట్టు జాతర జరగనుంది. పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.సూర్యాపేట జిల్లా పెద్దగట్టులో లింగమంతులస్వామి జాతర పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ జాతరకు 20 లక్షల మందికిపైగా భక్తులు రానున్నారు. రూ.5 కోట్లతో రహదారుల మరమ్మతులు, గుట్టపై నుంచి వచ్చే మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీల పనులు చేపట్టారు.. గుట్టపై చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. 21 శాఖల జిల్లా అధికారుల కోసం గుట్ట కింద పందిళ్లతో ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే ప్రముఖుల కోసం అతిథి గృహాన్ని సిద్ధం చేశారు. గుట్టపై ఎక్కడపడితే అక్కడ జంతుబలి చేయకుండా ప్రత్యేకంగా షెడ్డును నిర్మించారు. గుట్టపై జంతువుల రక్తాన్ని శుభ్రంచేసే యంత్రాన్ని సిద్ధం చేశారు. ప్రమాదకరంగా ఉన్న చెరువుకట్టకు కర్రలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. తలనీలాలు సమర్పించిన భక్తులు స్నానం చేసేందుకు గుట్ట కింద కోనేరుతోపాటు గుట్టపైన షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న శాశ్వత మరుగుదొడ్లతోపాటు తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పెద్దగట్టు జాతర సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈనెల16న జాతర ప్రారంభం కానుండగా 16,17,18 తేదీల్లో హైదరాబాద్ - విజయవాడ 65వ జాతీయ రహదారిపై నుంచి వెళ్లే వాహనాలను నార్కెట్ పల్లి మీదుగా దారి మళ్లించనున్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం పోలీసులు నాలుగు చోట్ల ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌కోసం మొత్తం 25 ఎకరాలు సేకరించి చదును చేస్తున్నారు. సూర్యాపేట మీదుగా పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తుల వాహనాలు హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రామకోటి తండాకు వెళ్లే మార్గంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. గరిడేపల్లి, పెన్‌పహాడ్ నుంచి దురాజ్‌పల్లి నుంచి వచ్చే భక్తుల వాహనాలను పాత కలెక్టరేట్ కార్యాలయం వెనుక కేటాయించిన స్థలంలో పార్కింగ్ కు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే వీఐపీ వాహనాలను పెద్దగట్టు తూర్పు మెట్లకు ఎదురుగా ఉన్న స్థలంలో పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు.

# మహిళలు ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు..!

**భారత సంస్కృతికి విశేష కృషిచేసిన అహల్యా బాయి హెూల్కర్...**

**వ్యవసాయం అనేక విషయాల సమ్మిళితం.... పాడి, పంట రైతుకు రెండు కళ్ళు.....**





కరీంనగర్,జనతా న్యూస్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మూల స్తంభాలాంటివారని, నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని , గృహిణిగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే పలు వ్యాపారాలు, వృత్తులు, ఉద్యోగాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ విజయాల బాటలో పయనిస్తున్నారని మహిళా సాధికారత , వ్యాపార వ్యవస్థాపకత కమిటీ చైర్మన్ బెల్లం మాధవి తెలిపారు. స్వదేశీ మేళా ప్రోగ్రాం లో భాగంగా శుక్రవారం రోజున మహిళా ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి అంశంపై స్వశక్తి మహిళలకు సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు చిన్న తరహా, కుటీర పరిశ్రమల వంటివి స్థాపించి తాము స్వయం ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని, జీవనోపాధిని మెరుగుపరచుకోవాలన్నారు. అనంతర కాలాంశంలో లోకమాత , ధీరవనిత అహల్యబాయి హెూల్కర్ గురించి కేశవ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత మహిళా ప్రాంత మహిళా ప్రముఖ్,డా. కళ్లెం స్వప్న మాట్లాడారు. భారతదేశ సంస్కృతికి అహల్య భాయి విశేష కృషి చేశారని, ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఆమె పేరిట శ్రీ శక్తి పురస్కారాన్ని నెలకొల్పారని చెప్పారు. పరిపాలన సమయంలో అహల్య భాయి సేవకు, దానధర్మాలకు మారుపేరుగా నిలిచారన్నారు. మమ్మదీయుల దాడుల్లో శిథిలమైన అనేక దేవాలయాలను పునర్నిర్మించారన్నారు. హిందూ ధర్మ పునరుత్తేజ్జానికి ఆమె విశేష కృషి చేశారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పాడిపంట, రైతు ఆర్థిక స్వావలంబన సెమినార్ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఎన్నారై సామ ఎల్లారెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయం అనేక విషయాల సమ్మిళితమని , ప్రధానంగా వ్యవసాయభివృద్ధి, గ్రామీణభివృద్ధితో దగ్గరి సంబంధం కలిగి ఉందన్నారు. గ్రామీణ జనాభాలో ఎక్కువమంది ఏదో రూపంలో వ్యవసాయంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అత్యధిక వ్యవసాయ ఉత్పత్తి గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతుందన్నారు. రసాయన వ్యవసాయం కంటే ప్రకృతి వ్యవసాయమే సంపూర్ణ వ్యవసాయ విధానమే శ్రేయస్కరమన్నారు. ప్రకృతి వ్యవసాయం నేల పునరుత్పత్తి , నీరు, గాలి నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని, పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తుందన్నారు. సమగ్ర వ్యవసాయంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, పంటలతో అనుసంధానానికి ఎన్నో రంగాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా రైతులు వారి ప్రాంతంలో ఉన్న వనరులను అనుసరించి వ్యవసాయంపై శ్రద్ధ చూపితే మన సాంప్రదాయ వృత్తిగా ఉన్న వ్యవసాయంలో అంటూనే కుటుంబానికి అదనపు ఆదాయం , ఉపాధి కలిగించుకోవచ్చన్నారు. పాడి పశువులు , సేంద్రియ ఎరువుల ఉత్పత్తి , కూరగాయల సాగు వంటివి సమగ్ర వ్యవసాయ విధానంలో రైతులకు అనుకూలమైనవన్నారు. సమగ్ర వ్యవసాయ విధానంతో రైతుకి ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయానికి ప్రగతి అన్నారు. ఇట్టి కార్యక్రమంలో స్వదేశీ జాగరన్ మంచ్ తెలంగాణ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ బల్ల స్వప్న, రాష్ట్ర సేవికాసమితి జిల్లా కార్యవాహిక బూర్ల విజయలక్ష్మి, సహ కార్య వాహిక కామారపు మంజుల, నగర కార్యవాహిక కళ్లెం కవిత, పాక సంధ్య రేఖా, రమ, స్వరూపరాణి , న్యూట్రిషనిస్ట్ కాచం దీప్తి లతో పాటు కరీంనగర్ డైరీ చైర్మన్, స్వదేశీ మేళ కన్వీనర్ రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతో ప్రతిపక్షాలు విష ప్రచారం

**ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధినవుతా**

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**



జగిత్యాల,జనతా న్యూస్ : రానున్న కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఓటమిని ముందే అంగీకరించాయని భయంతోనే తనపై ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగతంగా విష ప్రచారం చేస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు.. శుక్రవారం జగిత్యాల జిల్లాలో విస్తృతంగా పర్యటించారు.. ధర్మపురి,జగిత్యాల,కోరుట్ల,నియోజకవర్గాల్లో పట్టభద్రులు కాంగ్రెస్ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలకు రిహాల్సర్ లాంటివని కాంగ్రెస్ శ్రేణులంతా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు... కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధిగా ఉండి వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు... కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని... అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు ప్రకటించి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించిందని అన్నారు.. ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా చేసే విష ప్రచారాలను తిప్పికొట్టాలని.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి ప్రతి పట్టభద్రుని కలిసి వివరించాలని తెలిపారు.. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్.. ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నరసింగ రావు పలువురు మండల అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్లు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

## మున్సిపల్ కార్యాలయంలో మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.....

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి, జనతా న్యూస్: పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎల్.ఆర్.ఎస్, ట్రేడ్ లైసెన్స్ , వివిధ మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని పురపాలక భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురపాలక భాగంలోని ప్రతి సెక్షన్ ను కలెక్టర్ పరిశీలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్.ఆర్.ఎస్, ట్రేడ్ లైసెన్స్ మేళాలను కలెక్టర్ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణంలో 100 శాతం ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్ వసూలు పూర్తి చేయాలని అన్నారు. వార్డు అధికారులు మున్సిపల్ చట్టాల పై అవగాహన పెంచుకోవాలని క్షేత్ర స్థాయిలో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. రాబోయే వేసవి కాలంలో ప్రజలకు త్రాగు నీటి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చెయ్యాలి: జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



సిద్దిపేట,జనతా న్యూస్: జిల్లాలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (TGIIC) వారికీ కేటాయించిన భూముల భూసేకరణ వేగంగా పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కేటాయించిన మండలాల్లో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ వారికీ కేటాయించిన భూముల భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చెయ్యాలని సూచించారు. మండలాల వారీగా తహసీల్దార్, సర్వే అధికారులు కేటాయించిన ప్రభుత్వ, పట్టా, అసైన్డ్ భూములు ఎన్నో వెరిఫై చెయ్యాలని సూచించారు. భూసేకరణ పూర్తి కాగానే భూమి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించుకోవాలని టీజీఐఐసీ అధికారులకి తెలిపారు. కొన్ని భూముల వివరాలు పాత విధానం లో ఉన్నందున కొత్త భూసేకరణ వివరాల ప్రకారం పత్రలు తయారు చేసుకోవాలి. భూసేకరణను డ్రోన్ ద్వారా కొలతల తీసుకుంటే సులభంగా వేగంగా అవుతుందని తెలిపారు. ఈ మొత్తం ప్రాసెస్ ఆర్డీవోలు ఎల్లప్పుడూ పర్యవేక్షణ చెయ్యాలి. టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారుల సమన్వయము తో భూసేకరణ వేగంగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు.

ఈ సమావేశం లో ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, డీజీఎం ఉమా మహేశ్వర్, డిఈ జ్యోతి, డిఎం మహేశ్వర్ మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయాన్ని పరిరక్షించే వాళ్ల పై దాడులు సమాజానికి చేటు

**న్యాయమూర్తి పై దాడి న్యాయ వ్యవస్థను అవమానించినట్టే**

**కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఆవేదన**




కరీంనగర్,జనతా న్యూస్: రాష్ట్రంలో, దేశంలో నిత్యం ఏదో ఒక చోట న్యాయవాదుల పై, న్యాయమూర్తుల దాడులు జరగడం బాధాకరమని, ఈ దాడులు న్యాయ వ్యవస్థ పైనే నమ్మకం కోల్పోయేలా చేయడమే కాకుండా న్యాయ వ్యవస్థనే అవమానించేలా నేరప్రవృత్తి ఉన్న కొంతమంది ప్రవర్తిస్తున్నారని, ఈ దాడులను అరికట్టాలంటే కఠినమైన న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి కోరారు. రంగ రెడ్డి జిల్లా కోర్టులో 9వ అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు మహిళ న్యాయమూర్తి పై గురువారం రోజు కరణ్ సింగ్ అనే కరడుగట్టిన నేరస్థుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్బంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయాన్ని పరిరక్షించే వాళ్ల పై నిత్యం దాడులు చేయడం సమయానికి మంచిది కాదని, సమాజంలో ఏ వ్యవస్థ పైన నమ్మకం ఉంది అనుకుంటే అది ఒక న్యాయవ్యవస్థ పైనే ఉందనే విషయం ప్రభుత్వాలు గమనించాలని, లేనిపక్షంలో

ఈ దాడులు ఇలాగే జరుగుతుంటే న్యాయ వ్యవస్థ పై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా కొంతమంది వ్యవహరిస్తున్న తీరును ప్రభుత్వాలు గమనించి అరికట్టే విధంగా న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాల్సిందేనని బేతి మహేందర్ రెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు టి.రఘువీర్, లైబ్రరీ సెక్రటరీ కే. రాజేందర్, సేనియర్, జూనియర్ కార్యవర్గ సభ్యులు సుంకే దేవకిషన్, బెజ్జంకి శ్రీకాంత్ తో పాటు పెంచాల ప్రభాకర్ రావు, సిరికొండ శ్రీధర్ రావు, బలరాం, సంపత్, రమేష్, శ్రీనివాస్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చల్లూరు ఇసుక యార్డులో ప్రత్యేక బృందం తనిఖీ



జమ్మికుంట,జనతా న్యూస్: వీణవంక మండలం చల్లూరు లోని ఇసుక స్టాక్ యార్డ్, రీచ్ పాయింట్ వద్ద ప్రత్యేక బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టింది. రెవిన్యూ, మైన్స్, పోలీస్, రవాణా శాఖ అధికారుల బృందం ఇసుక స్టాక్ యార్డులోని నిల్వలను పరిశీలించింది. రాయల్టీ ఇన్ స్పెక్టర్ నమోదు చేసిన ఇసుక రవాణా వివరాల రిజిస్టర్లు తనిఖీ చేసింది. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాఘవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. చల్లూరు రోడ్డులో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని, పోలీస్, రెవెన్యూ, మైన్స్, రవాణా ఉద్యోగులతో ఏర్పాటు చేసిన బృందం నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ జియాలజిస్ట్ వెంకటేశ్వరరావు, వీణవంక పోలీస్ ఇన్స్పెక్టర్, తహసిల్దార్, రెవిన్యూ, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్య గిరీంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**అరుదైన ఆలయానికి కొత్త హంగులు**

**భక్తులకు సౌకర్యాల కల్పన**

**బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే సత్యనారాయణ**



మానకొండూరు,జనతా న్యూస్: శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాల సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అరుదైన శ్రీ మత్స్య గిరీంద్ర స్వామి దేవస్థానం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మానకొండూరు నియోజకవర్గం పరిధిలో ఉండడం, ఆ స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మత్స్యగిరీంద్ర స్వామి వారి కరుణాకటాక్షాలతో కొత్తగట్టు గ్రామ ప్రజలే కాకుండా నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు ఆయన చెప్పారు. కొండపైన కొలువైన ఈ ఆలయం పరిసరాలు అహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉండడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

**కొత్తగట్టు ఆలయానికి కొత్త హంగులు**

తాను ఎమ్మెల్యేగా అయినప్పటి నుంచి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించానని అని చెప్పారు. ఈ ఆదాయానికి కొత్త హంగులు కల్పిస్తానని ఆయన చెప్పారు. ఈ క్రమంలోనే తాను చేసిన కృషి వల్లనే ఆలయం దశలవారీగా అభివృద్ధి చెందుతోందని, ఈ ఆలయంలో భక్తుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గట్టు తిరుపతి జిల్లా కార్యదర్శి బండారు తిరుపతి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు పద్మ, కొత్తగట్టు గ్రామ శాఖ పార్టీ అధ్యక్షుడు తిరుపతి, ఆలయ పూజారి మురళీధర చారితోపాటు పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళ న్యాయమూర్తి పై దాడికి నిరసనగా...

**హుజురాబాద్ లో విధులను బహిష్కరించిన న్యాయవాదులు**

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధుల బహిష్కరణ**



హుజురాబాద్ ఫిబ్రవరి 14 జనతా న్యూస్: హైదరాబాద్‌లో మహిళా న్యాయమూర్తిపై ఓ కేసులో నేరస్తుడుగా ఉన్న వ్యక్తి కోర్టులో దాడి చేయడాన్ని హుజురాబాద్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనను నిరసిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం విధులను బహిష్కరించారు.గురువారం రోజు కోర్టులో కేసు విచారణ జరుపుతున్న ఎల్ బి నగర్ సెషన్స్ జడ్జిపై నిందితుడు చేసిన దాడిని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. కరడుగట్టిన నేరస్తుల కేసులు నిత్యం విచారించే జ్యుడీషియల్ అధికారుల భద్రత కోసం అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన మహిళా న్యాయమూర్తి ఇటీవలే హత్యాయత్నం కేసులో ఆ నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారని, అదే వ్యక్తి యొక్క ఇతర క్రిమినల్ కేసును విచారిస్తున్నప్పుడు, ముద్దాయి ఆకస్మాత్తుగా బహిరంగ కోర్టులో ఆ మహిళా జడ్జిపై విచక్షణ రహితంగా దాడి చేశాడని, అమానుషంగా ప్రవర్తించాడని అతనిని శిక్షించినందుకు తీవ్ర పరిణామాలు ఉంటాయని న్యాయమూర్తిని మరియు ఆమె కుటుంబ సభ్యులను బెదిరించడం హెచ్చరించడం దారుణమని వారు పేర్కొన్నారు. ఈ సంఘటన విషయంలో పోలీసులు చట్టం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, న్యాయవాదులు ముక్కెర రాజు, మంచికట్ల శ్రీనివాస్, భానుకిరణ్, గోపు సమ్మిరెడ్డి, ఆకుల శ్రీనివాస్, కేశబోయిన అశోక్, పిట్టల రాజేశ్, రాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి వడగాలులు నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

**వేసవి వడగాలుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి -14: వేసవి వడగాల్పుల నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వేసవి వడ గాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లోని ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు సరిగ్గా పని చేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలని అన్నారు.మార్చి నుంచి జూలై వరకు ఆశా కార్యకర్త నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు వరకు ప్రతి ఒక్కరి దగ్గర అవసరమైన మేర ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. వడ గాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా ఆసుపత్రిలో ఫైర్ ఆడిట్ నిర్వహించాలని అన్నారు.సమ్మర్ హీట్ వేవ్ నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో త్రాగునీటి సరఫరాకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాల



వద్ద చల్లని త్రాగునీరు అందుబాటులో ఉండేలా చలి వేంద్రాల ఏర్పాటు చేయాలని అన్నారు.

జిల్లా అధికారుల ట్విట్టర్, ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ అకౌంట్ , జిల్లా వెబ్ సైట్ లలో కూడా హీట్ వేవ్ నుంచి సంరక్షించేందుకు చేపట్టే జాగ్రత్తల గురించి ప్రచారం చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ఉన్న టీచర్లు, కార్యకర్తల ద్వారా గ్రామాలలో ప్రచారం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సమయాలను చేంజ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డి.ఎం.హెచ్.ఓ.రజిత, ఇన్చార్జి డిపిఓ శేషాద్రి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి వి.శ్రీధర్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ సిబ్బంది, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సంబంధిత ఇతర శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీస్ చట్టం 2023 వెనక్కి తీసుకునేంతవరకు నిరంతర పోరాటం




**పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టీకరణ**

**హుజురాబాద్ లో పోస్ట్ ఆఫీస్ ముందు నిరసన తెలిపిన తపాలా ఉద్యోగులు**

హుజురాబాద్, ఫిబ్రవరి 14 జనతా న్యూస్: పోస్టాఫీసు 2023 చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం హుజురాబాద్ ప్రధాన తపాల కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యు మహేందర్ మాట్లాడుతూ తపాల శాఖలో ప్రవేశపెడుతున్న నూతన సంస్కరణల వల్ల తపాల వ్యవస్థ నిర్వీర్యం కాబోతుందని ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోస్ట్ ఆఫీస్ చట్టం 2023 ప్రకారం తపాల శాఖలో తీసుకుంటున్న నూతన సంస్కరణల ద్వారా ప్రవేశపెడుతున్న ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ ల ద్వారా పోస్ట్ మెన్ స్టాఫ్ తగ్గిపోతుందని మెకానైజ్డ్ డెలివరీ సిస్టం ద్వారా పోస్ట్ మెన్ ఉద్యోగులకు భద్రత లేనటువంటి విధానాన్ని ప్రవేశపెట్టి రోడ్డు మైలేజీ కిలోమీటర్ కు 98 పైసలు చెల్లించి వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఇటీవల ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ సిస్టంను వ్యతిరేకిస్తున్నామని ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ చేసేంతవరకు ఉద్యోగుల పోరాటం నిరంతరమని, ఎనిమిదవ వేతన కమిటీ ద్వారా ఉద్యోగులకు క్యాడర్ చేసి గ్రేడ్ పే పెంచాలని , నిత్యావసరాల ధరల ను దృష్టిలో పెట్టుకొని కనీస వేతనాన్ని రూ.18 వేల నుండి రూ.45 వేలకు పెంచాలని ఎనిమిదవ వేతన కమిటీలో గ్రామీణ డాక్ సేవకులను తీసుకొని వారికి సివిల్ సర్వెంట్ హోదా ను కల్పించి పెన్షన్, మెడికల్ బెనిఫిట్స్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పోస్ట్ ఆఫీస్ ఖాతాలకు సంబంధించి ఏటీఎం కార్డ్స్ ను ఐపిపిబి కి తరలించడానికి వ్యతిరేకిస్తున్నామని, ఎస్టాబ్లిష్మెంట్ రివ్యూ ద్వారా తపాలా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల పైన తీవ్ర ఒత్తిడి నెలకొందని ఇలాంటి ఉద్యోగ వ్యతిరేక మార్పుల ద్వారా తపాలా శాఖ కు తీవ్ర నష్టం చేకూరుతుందని అన్నారు. ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రశ్నించే సంఘాల గుర్తింపు రద్దు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తు రాంచి హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ నాయకులు కామ్రేడ్ పి రవికుమార్, జై రజనీకాంత్, తిరుపతి నాయక్, ఏ అనిల్ కుమార్, రాజమౌళి, ప్రవీణ్, చంద్రమోహన్, వేణు, సందీప్, శ్రీనివాస్, సమ్మురాజు, మీస తిరుమలేష్ , ఎండి రఫీ, హరీష్, అనిల్, గౌరవ్, స్వామి, సతీష్, ఎర్ర రాజు, అపూర్వ, శివాజీ, రాజేష్, సాయి, సత్యం, రాము తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో రిజర్వాయర్లను నింపండి

**రైతుల గోస ఆగు పడటం లేదా ?**

**జనగామ ఎమ్మెల్యే పల్ల ఆగ్రహం**



జనగామ, ఫిబ్రవరి 14 జనగామ నియోజకవర్గం లో రైతులకు సాగునీరు అందక అల్లాడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుం దని జనగామ ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు లో భాగంగా గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయిన గూడెం, వెల్దండ, లద్నూర్, తపాస్పల్లి రిజర్వాయర్లను నింపకపోవడంతో రైతులు వ్యవసాయం చేసుకోలేక అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. వెంటనే ఆయా రిజర్వాయర్లను నింపి జనగామ నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీజన్ కి ముందే నీళ్లు ఇవ్వాల్సి ఉండగా , ప్రభుత్వం సీజన్ ప్రారంభమై, నాట్లు అయిపోయినా కూడా రైతులకు నీళ్లు ఇవ్వకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయన ఆరోపించారు. నీళ్ళకోసం రైతుల తన్లాడుతుంటే అటు అధికారులకు కానీ ఇటు ప్రభుత్వానికి ప్రభుత్వానికి కానీ చీమకుట్టినట్లు లేదు అని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజూ రైతులు నాకు సమస్యలు చెప్తుంటే వాటిని ఇరిగేషన్ అధికారులు అయిన ఏ ఈ, డి ఈ, ఎస్ ఈ , సి ఈ వరకు అందరి ఇరిగేషన్ అధికారులకు చివరికి సెక్రెటరీ వరకు కూడా రైతుల అవస్థలను తెలుపుతూ ఫిర్యాదులు విజ్ఞప్తులు ఎన్ని చేసినప్పటికీ. పెడచెవిన పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఇటీవల అన్ని పంపులను బంద్ చేశారని ఇదెక్కడి న్యాయమంటూ ఆయన ప్రశ్నించారు. రైతుల విషయంలోరాజకీయాలు చేయవద్దని హెచ్చరించారు . ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందిస్తూ రిజర్వాయర్లను నింపి సకాలంలో సాగునీరును అందిస్తూ రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతులు ఆందోళన బాట పడతారని ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

# సుంకాలపై వెనక్కి తగ్గేది లేదు

**మీ చర్యలకు..మా ప్రతి చర్యలు ఉంటాయి**

**మీరు తగ్గిస్తే..ఆ మేరకు మేమూ తగ్గుతాం**

**ప్రధాని మోడీతో భేటీలో తేల్చేసిన ట్రంప్**

వాషింగ్టన్, ఫిబ్రవరి 14 : సుంకాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తేల్చి చెప్పారు. ఇది దేశ హితం కోసం తీసుకున్న నిర్ణయమని అన్నారు. భారత్ ఎంత మిత్ర దేశమైనా.. పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా శ్వేతసౌధంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు సంయుక్త విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రెసిప్రోకల్ టారిఫ్‌ల గురించి వచ్చిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు. 'ప్రస్తుతం మేము రెసిప్రోకల్ నేషన్ అంటే ఎదుటి దేశం ఎలా స్పందిస్తే.. అలానే ప్రతిస్పందించే దేశం..అన అన్నారు. భారత్ లేదా మరే దేశమైనా సరే.. మాపై తక్కువ పన్నులు విధిస్తే.. మేము కూడా అలానే టారిఫ్‌లు వేస్తాము. భారత్ మాపై ఎంత శాతం పన్ను విధిస్తే.. మేమూ అంతే ఛార్జి చేస్తాము. వారి సుంకాలు ఎంత ఎక్కువన్నది ఇక మా సమస్య కాదు. నా తొలివిడత పాలనలో అధిక టారిఫ్‌లపై చర్చించాము. కానీ, ఎలాంటి రాయితీలు పొందలేకపోయాం. అందుకే మేము తేలికైన మార్గాన్ని ఎంచుకొన్నాం. వారెంత విధిస్తే.. మేము అంతే ఛార్జి చేస్తాం. అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య అని అన్నారు. మాకు ఐరోపా అత్యంత సమస్యాత్మకం. ఎవరూ కనీవినీ ఎరుగని స్థాయిలో మాపై పన్నులు విధిస్తున్నారు. వారు చాలా విషయాల్లో



అడ్వాంటేజ్ తీసుకొంటున్నారు. ఆ చర్యలతో మేము ఏమాత్రం సంతృప్తిగా లేము. ఇక చైనా విషయం మరింత భయంకరం. నేను అధికారంలోకి రాక ముందు కనీసం 10శాతం కూడా పన్ను విధించేవారు కాదు. నేను తొలిసారి పగ్గాలు చేపట్టినప్పుడు వారి నుంచి వందల బిలియన్ డాలర్లు పన్నుల రూపంలో వసూలు చేశాం. మేము సరిగ్గా ఎలా చేయాలో అలానే చేశాము' అని ట్రంప్ వివరించారు. మోదీ-ట్రంప్ పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్ల దాటించే లక్ష్యంతో మిషన్-500ను ప్రకటించారు. ఇక మోదీ పర్యటన రోజే పరస్పర టారిఫ్‌ల విషయాన్ని ట్రంప్ ముందుగానే తెరపైకి తెచ్చి బలమైన సంకేతాలు పంపారు. 'మూడు అద్భుతమైన వారాలు. ఇప్పటివరకు అత్యుత్తమైనవి కావచ్చు. కానీ, 'నేడు మాత్రం అత్యంత ముఖ్యమైంది. రెసిప్రోకల్ టారిఫ్స్' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలను పోస్టు చేశారు. మోదీతో భేటీకి కొద్ది గంటల ముందే.. అన్ని దేశాలపై పరస్పర సుంకాలను అమలు చేస్తూ.. ఫైల్‌పై సంతకం చేశారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట
# రెట్టించిన ఉత్సాహంతో భారత్

ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌ల్లో ఘనవిజయాలు సాధించడమే కాక.. జట్టులో సమస్యలన్నీ పరిష్కరించుకొని రెట్టించిన ఉత్సాహంతో ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమైంది భారత జట్టు. పుష్కరకాలం పాటు సొంతగడ్డపై టెస్టుల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది టీమ్ ఇండియా. 2012-13 సీజన్లో ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ ఓడాక.. భారత్‌కు సొంత గడ్డపై సిరీస్ ఓటమన్నదే లేదు. కానీ గత ఏడాది చివర్లో భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్.. టీమ్ ఇండియాకు షాక్‌ల మీద షాక్‌లు ఇచ్చింది. మూడు టెస్టుల్లోనూ భారత్‌ను ఓడించి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. మహామహా జట్లను మట్టికరిపించిన భారత్‌కు సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఇలాంటి పరాభవం ఎదురవుతుందని ఎవరూ ఊహించలేదు. ఇదే పెద్ద దెబ్బ అంటే.. తర్వాత ఆస్ట్రేలియాలో సైతం ఓటమి తప్పలేదు. తొలి టెస్టులో ఘనవిజయంతో సిరీస్‌ను ఘనంగా ఆరంభించిన భారత్.. తర్వాత నాలుగు టెస్టుల్లో మూడు ఓడి సిరీస్‌ను చేజార్చుకుంది. వరుసగా ఆస్ట్రేలియాలో రెండు సిరీస్‌లు సాధించిన భారత్.. ఈసారి మాత్రం బోర్డర్-గావస్కర్ ట్రోఫీని ప్రత్యర్థికి అప్పగించక తప్పలేదు. ఈ ఓటమితో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు కూడా గల్లంతయింది. వరుసగా రెండుసార్లు ఫైనల్ చేరిన భారత్.. ఈసారి మాత్రం లీగ్ దశలోనే నిష్క్రమించింది. వరుసగా రెండు సిరీస్‌ల్లోనూ రాణించకపోవడంతో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిల మీద తీవ్ర విమర్శలు తప్పలేదు. వాళ్లిక రిటైరైతే మేలనే వ్యాఖ్యానాలు వినిపించాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనే రోహిత్ రిటైర్మెంట్ గురించి జోరుగా ప్రచారం జరిగింది. కానీ అతను ఒత్తిడికి తలొగ్గలేదు. టీమ్ ఇండియా మీద అభిమానుల్లో అంచనాలు తగ్గిపోయిన స్థితిలో సొంతగడ్డపై ఇంగ్లండ్ లాంటి బలమైన జట్టుతో టీ20 సిరీస్ మొదలైంది. అందులో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీ20 జట్టు అదరగొట్టింది. 4-1తో సిరీస్ సాధించింది. ఈ సిరీస్‌తోనే సీనియర్ ఫాస్ట్




బౌలర్ మహ్మద్ షమీ పునరాగమనం చేశాడు. ఫిట్‌నెస్, ఫామ్ చాటుకున్నాడు. బ్యాటర్లు, బౌలర్లు నిలకడగా రాణించారు. ఇక వన్డే సిరీస్‌లో ఇంకా ఉత్తమ ప్రదర్శన చేసింది రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు. జట్టులో స్థానం ప్రశ్నార్థకమైన స్థితిలో శ్రేయస్ అయ్యర్ అదరగొట్టాడు. శుభ్‌మన్ గిల్ మళ్లీ ఫామ్ అందుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ ఏడాదికి పైగా విరామం తర్వాత వన్డేల్లో శతకం సాధించాడు. చివరి వన్డేలో కోహ్లి సైతం అర్ధశతకంతో లయ అందుకున్నాడు. కేఎల్ రాహుల్ సైతం చివరి వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇక బౌలింగ్‌లో అయితే భారత్‌కు ఢోకా లేదు. సీనియర్ పేసర్ మహ్మద్ షమీతో పాటు యువ బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా ఆకట్టుకున్నారు. స్పిన్నర్లు జడేజా, అక్షర్ పటేల్ నిలకడగా రాణించారు. వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ సైతం తమకు దక్కిన అవకాశాలను ఉపయోగించుకున్నారు. ప్రధానంగా రోహిత్, కోహ్లి జోరందుకోవడం భారత్‌కు అతిపెద్ద సానుకూలాంశం. ఇంగ్లండ్ లాంటి మేటి జట్టుపై వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి ఛాంపియన్స్ ట్రోఫీలో అడుగుపెట్టడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచుతుందనడంలో సందేహం లేదు.



## ఛాంపియన్స్ ట్రోఫీ 2025..
## విజేతకు బంపర్ ప్రైజ్‌మనీ

పాకిస్థాన్ ఆతిథ్యాన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఎనిమిది టీమ్‌లు తమ స్క్వాడ్‌లను ప్రకటించాయి. టీమ్‌ఇండియా ఆడే మ్యాచులు దుబాయ్ వేదికగానే జరుగుతాయి. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీకి సంబంధించి వివరాలను ఐసీసీ ప్రకటించింది. చివరిసారిగా 2017లో ఈ టోర్నీ జరిగిన సంగతి తెలిసిందే. అప్పటితో పోలిస్తే దాదాపు 53 శాతం ప్రైజ్‌మనీని పెంచడం గమనార్హం. దాదాపు రూ.60 కోట్ల ప్రైజ్‌మనీని టీమ్‌లకు పంచనుంది. చివరి ప్లేస్‌లో నిలిచిన జట్టుకూ రూ.1.22 కోట్లు దక్కనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్కో మ్యాచ్‌కు రూ.29 లక్షలు అదనంగా ఇవ్వనుంది.

వివరాలు ఇలా..
విజేత ప్రైజ్‌మనీ: రూ. 20.8 కోట్లు
రన్నరప్ ప్రైజ్‌మనీ: రూ. 10.4 కోట్లు
సెమీ ఫైనలిస్టులు: రూ. 5.2 కోట్లు (ఒక్కొక్క జట్టుకు)
ఐదో స్థానం, ఆరో స్థానం: రూ.3 కోట్లు
ఏడు, ఎనిమిదో స్థానాలు: రూ.1.2 కోట్లు
ప్రతి మ్యాచ్‌కు ప్రైజ్‌మనీ: రూ.29 లక్షలు

### గత ట్రోఫీలో ఎవరికెంతంటే?

ఎనిమిదేళ్ల కిందట 2017లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరిగింది. ఫైనల్‌లో భారత్‌పై గెలిచిన పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఆ జట్టుకు అప్పుడు రూ. 14.18 కోట్లను ప్రైజ్‌మనీగా ఐసీసీ ఇచ్చింది. రన్నరప్‌గా నిలిచిన భారత్‌కు రూ.7 కోట్లు దక్కాయి. సెమీస్‌కు చేరిన ఇంగ్లండ్, బంగ్లాదేశ్‌కు ఒక్కొక్క టీమ్‌కు రూ.3 కోట్లు, ఐదు-ఆరు స్థానాల్లోని ఆసీస్, దక్షిణాఫ్రికాకు చెరో రూ.58 లక్షలు, ఆఖరి రెండు ప్లేస్‌ల్లోని శ్రీలంక, న్యూజిలాండ్‌కు రూ.39 లక్షలు అందాయి.




## వన్డేల్లో రికార్డు..
### విరాట్ కంటే వేగంగా సాధించిన బాబర్

పాకిస్థాన్ స్టార్ ఆటగాడు బాబర్ అజామ్ ఓ ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ తలపడుతోంది. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ 29 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ క్రమంలో వన్డేల్లో 6వేలకుపైగా పరుగులు పూర్తి చేసుకున్నాడు. అత్యంత వేగంగా ఈ మార్క్‌ను అందుకొన్న దక్షిణాఫ్రికా ఆటగాడు హషీమ్ ఆమ్లాతో కలిసి బాబర్ సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. వీరిద్దరూ 123 ఇన్నింగ్స్‌ల్లో ఆరు వేల పరుగులు చేశారు. విరాట్ కోహ్లి (136 ఇన్నింగ్స్‌లు), కేన్ విలియమ్సన్ (139), డేవిడ్ వార్నర్ (139) ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. విరాట్ 2014లోనే హైదరాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనతను సాధించాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 5 వేల పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచిన బాబర్ అజామ్.. ఆ తర్వాత మాత్రం ఫామ్‌ను కోల్పోయాడు. అప్పటికి 97 ఇన్నింగ్స్‌ల్లోనే ఐదు వేల పరుగుల మైలురాయిని అందుకొన్నాడు. మరో వెయ్యి పరుగులు చేయడానికి మాత్రం 26 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. గత ఏడు ఇన్నింగ్స్‌ల్లో కేవలం రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే చేశాడు.



## శ్రేయస్‌ను తప్పించాలని అనుకోలేదు

టీమ్‌ఇండియా వన్డే జట్టులో శ్రేయస్ అయ్యర్ కీలక సభ్యుడని, అతడిని తప్పించాలని ఎప్పుడూ అనుకోలేదని జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్ అన్నాడు. కోహ్లి గాయపడటంతో తనకు ఆడే అవకాశం లభించిందని ఇంగ్లాండ్‌తో తొలి వన్డే అనంతరం శ్రేయస్ అయ్యర్ చెప్పడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో 59 పరుగులు చేసిన శ్రేయస్.. తర్వాతి రెండు వన్డేల్లో వరుసగా 44, 78 పరుగులు చేసి టీమ్‌ఇండియా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంలో కీలకపాత్ర పోషించాడు. "సిరీస్‌లో ఏ ఒక్క మ్యాచ్‌లో అయ్యర్‌ను తప్పించాలని అనుకోలేదు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో రాణించిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలని భావించాం. కేవలం ఒక్క ఇన్నింగ్స్‌తో జైస్వాల్‌పై ఒక అభిప్రాయానికి రాలేం. కానీ అతడికంటే శ్రేయస్ ముఖ్యమైన ఆటగాడని మాకు తెలుసు. అతడిని తప్పించాలని అనుకోలేదు" అని గంభీర్ వివరించాడు.

## వారి నుంచి ప్రశంసలు..
## విమర్శలూ ఎక్కువే : స్మృతి మంధాన




మహిళల ప్రీమియర్ లీగ్ మూడో సీజన్‌కు వేళైంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో తలపడనుంది. ఐపీఎల్‌లో ఆర్సీబీ ఇప్పటి వరకూ టైటిల్ సాధించలేదు. కానీ, డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను గతేడాది ఆ మహిళా జట్టు అందించడంతో ఫ్రాంచైజీ ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేవు. ఈ క్రమంలో మహిళా జట్టుపై ప్రశంసలు కురిపించిన అభిమానులు.. పురుషుల టీమ్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో తమ ఫ్యాన్ బేస్‌పై ఆర్సీబీ సారథి స్మృతి మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకరకంగా తమ ప్రదర్శనకు వారి అభిమానమే ఎంతో సాయంగా ఉంటుందని తెలిపింది. "మా చుట్టూ ఏం జరుగుతుందనేది మేం పట్టించుకోం. జట్టుగా నాణ్యమైన క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తాం. ఆర్సీబీకి అభిమాన గణం భారీ స్థాయిలో ఉంటుంది. మిగతా టీమ్‌లతో పోలిస్తే మాపై వచ్చే ప్రశంసలు, విమర్శలూ కాస్త ఎక్కువగానే ఉంటాయి. ఇలా ఉండటం వల్ల జట్టంతా కలిసికట్టుగా మైదానంలో పోరాడుతాం. ఎక్కడికెళ్లినా అభిమానులు ఆర్సీబీ అంటూ నినాదాలు చేయడం బాగుంటుంది. దానిని మేం పాజిటివ్‌గానే తీసుకుంటాం" అని మంధాన వ్యాఖ్యానించింది. "డబ్ల్యూపీఎల్ వేలం తర్వాత మా జట్టులో చాలా మంది గాయాలపాలయ్యారు. అందుకే, గత సీజన్‌లో బరిలోకి దిగిన ఫైనల్‌లో కొందరు అందుబాటులో లేరు. మా ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ లేకపోవడం మాకు తీవ్రమైన లోటే. గత పదేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుతంగా రాణించింది. ఆమె తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తాం. ప్లేయర్లకు గాయాలు కావడంపై ఇప్పటికే జట్టులో చర్చించాం. అయినా, మా బ్రాండ్ క్రికెట్‌ను ఆడేందుకు ప్రయత్నిస్తాం" అని కెప్టెన్ స్మృతి స్పష్టం చేసింది.

## బీసీసీఐ 'పది' ఆదేశాలు..
### ఛాంపియన్స్ ట్రోఫీలోనూ కఠినంగానే అమలు!

క్రికెటర్ల విషయంలో బీసీసీఐ ఇప్పటికే కఠినమైన నిబంధనలు రూపొందించింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాభవం ఎదురవడంతో ఆటగాళ్లు, స్టాఫ్ విషయంలో పది సూత్రాలను క్రికెట్ బోర్డు సిద్ధం చేసింది. క్రమశిక్షణతోపాటు జట్టులో సానుకూల వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఇంగ్లండ్‌తో సిరీసుల్లో కఠినంగా అమలుచేసింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యక్తిగత కార్యదర్శిని జట్టుకు దూరంగా ఉంచింది. టీమ్ ఉన్న హోటల్‌లో ఉండేందుకు అనుమతి ఇవ్వలేదు. ఇదే విధానం ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగానూ అమల్లో ఉంటుందని.. క్రికెటర్లు తమ భాగస్వాములను తీసుకెళ్లడంపైనా ఇప్పటికే స్పష్టత ఇచ్చినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. "కోచింగ్ స్టాఫ్‌లోని ఒకరి వ్యక్తిగత కార్యదర్శి తరచూ జట్టు బస చేసే హోటల్‌లోనే కనిపించేవాడు. ఇప్పుడు మాత్రం అతడికి వేరే హోటల్‌లో వసతి కల్పించడం జరిగింది. ఇంగ్లండ్‌తో ప్రతి మ్యాచ్ సమయంలోనూ ఇలానే జరిగింది. ఆస్ట్రేలియా పర్యటనప్పుడే ఆ పీఏ జాతీయ సెలక్టర్లు ఉన్న కారులో ఉండేవారు. ప్రైవేట్‌గా మాట్లాడుకొనేందుకూ వారికి అవకాశం ఉండేది కాదు. అసలు అడిలైడ్ టెస్టు సమయంలో బీసీసీఐ ఆతిథ్య బాక్స్‌లో ఎలా అవకాశం ఇచ్చారనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అంతేకాకుండా కేవలం ఆటగాళ్లను మాత్రమే అనుమతించే బ్రేక్‌ఫాస్ట్ ప్రదేశంలోకి సదరు పీఏ వచ్చేవాడు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న బీసీసీఐ కఠిన చర్యలకు ఉపక్రమించింది" అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు ఓ క్రికెటర్ 250 కేజీలకుపైగా లగేజీ తీసుకెళ్లినట్లు సమాచారం. బీసీసీఐ ఆ బిల్లును చెల్లించాల్సి వచ్చింది. ఇక కొత్త నిబంధనల ప్రకారం 150 కేజీల వరకే ఆటగాళ్లకు పరిమితి విధించింది.


### ఫ్యామిలీకి నో ఛాన్స్

ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా స్టార్ క్రికెటర్లు తమ కుటుంబసభ్యులను తీసుకెళ్లేందుకు బీసీసీఐ




అనుమతించలేదు. టోర్నీ వ్యవధి కేవలం మూడు వారాలే కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు వెల్లడించిన పది ఆదేశాల్లో నెల రోజుల పర్యటన ఉంటేనే ఒక వారం కుటుంబ సభ్యులతో ఉండేందుకు వీలుండేది. కానీ, ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న ప్రారంభమై.. మార్చి 9న ముగుస్తుంది. దీంతో ఎవరికీ మినహాయింపు ఇవ్వకూడదని బీసీసీఐ నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై ఓ సీనియర్ క్రికెటర్ నుంచి వినతి వచ్చినా.. బీసీసీఐ మాత్రం అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. జట్టు బస చేసే హోటల్‌లో ఉండేందుకు వీల్లేదు. దీంతో సహచర క్రికెటర్లతో కలిసి రూమ్‌ను షేర్ చేసుకోవడం, జట్టు ప్రయాణించే బస్సులోనే అందరూ వెళ్లాలని స్పష్టంగా పేర్కొంది. దీనివల్ల ఆటగాళ్ల మధ్య సంబంధాలు మెరుగ్గా ఉంటాయనేది బీసీసీఐ భావన. అదేవిధంగా వ్యక్తిగత సిబ్బంది విషయంలోనూ ఇలాగే వ్యవహరించనుంది. అయితే, బోర్డు తరఫున ఆటగాళ్ల డైట్ కోసం ప్రత్యేకంగా చెఫ్‌లను కేటాయించాలని ఆలోచనలు చేస్తోంది.

## ఒకరోజు ముందే ఐపీఎల్
# కొత్త సీజన్ స్టార్ట్..




ఇండియన్ ప్రీమియర్ లీగ్ కొత్త సీజన్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఐసీసీ మెగా టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన కొద్ది రోజుల్లోనే టీ20 లీగ్ అలరించనుంది. తొలుత మార్చి 23 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ పోటీలు ప్రారంభమవుతాయని వార్తలు వచ్చాయి. తాజాగా మరో అప్‌డేట్ వచ్చేసింది. మార్చి 22న అంటే ఒక్కరోజు ముందుగానే 18వ ఎడిషన్ ప్రారంభం కానుంది. ఈమేరకు క్రిక్‌బజ్ వర్గాలు పేర్కొన్నాయి. తొలి మ్యాచ్ గతేడాది ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. ఇక గత సీజన్‌లో ఫైనల్‌కు చేరిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తన తొలి మ్యాచ్‌ను సొంత మైదానం ఉప్పల్ స్టేడియంలో ఆడనుంది. రాజస్థాన్ రాయల్స్‌తో మార్చి 23న తలపడనున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్ మ్యాచ్ మే 25న జరిగే అవకాశం ఉంది.

### సన్‌రైజర్స్ మ్యాచ్ ఎప్పుడు ఉండొచ్చంటే?

అయితే, ఐపీఎల్ వర్గాల నుంచి మాత్రం అధికారికంగా దీనిపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. షెడ్యూల్‌కు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మొత్తం మ్యాచ్‌లు 12 మైదానాల్లో జరగనున్నాయి. అహ్మదాబాద్, ముంబయి, చెన్నై, బెంగళూరు, లఖ్‌నవూ, ముల్లాన్‌పుర్, దిల్లీ, జైపుర్, కోల్‌కతా, హైదరాబాద్ స్టేడియాలతోపాటు గువాహటి, ధర్మశాల కొన్ని మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. రాజస్థాన్ రాయల్స్‌కు గువాహటి రెండో హోం గ్రౌండ్‌గా.. పంజాబ్ కింగ్స్‌కు ధర్మశాల రెండో సొంత మైదానంగా ఉండనున్నాయి.

### ఆ జట్ల కెప్టెన్సీ ఎవరికో?

మొత్తం 10 జట్లు ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ తలపడనున్న సంగతి తెలిసిందే. రిటెన్షన్ విధానంతోపాటు ఐపీఎల్ మెగా వేలంలో ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తీసుకున్నాయి. దీంతో పది జట్లలో కొన్నింటికి ఇంకా సారథులను అధికారికంగా ప్రకటించలేదు. గురువారమే ఆర్సీబీ కెప్టెన్‌గా రజత్ పటీదార్ నియమితులయ్యాడు. ఇప్పటికే ముంబయికి హార్దిక్, చెన్నైకి రుతురాజ్ గైక్వాడ్, హైదరాబాద్‌కు పాట్ కమిన్స్, గుజరాత్‌కు గిల్, లఖ్‌నవూకు రిషభ్ పంత్, రాజస్థాన్‌కు సంజుశాంసన్, పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ ఉన్నారు. ఇంకా కోల్‌కతా నైట్‌రైడర్స్, దిల్లీ క్యాపిటల్స్‌కు సారథులను నియమించాల్సిఉంది. దిల్లీకి కేఎల్ రాహుల్ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరికి అవకాశం ఉంది. కేకేఆర్ విషయంలోనే ఇంకా ఓ స్పష్టత రావడం లేదు.





# ఆ అలవాటుందన్న సంయుక్త

టాలీవుడ్ ఆడియన్స్ కు సంయుక్తా మీనన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తెలుగుతో పాటూ తమిళ, మలయాళ సినిమాతో కూడా సౌత్ లో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న సంయుక్త భీమ్లా నాయక్ సినిమాతో అందరి దృష్టిని అలరించింది. సాగర్ కే చంద్ర దర్శకత్వంలో తెలుగు ఆడియన్స్ కు పరిచయమైన ఈ భామ ప్రేక్షకుల గుండెల్లో చోటు దక్కించుకుంది. విరూపాక్ష సినిమాలో తన నటనతో అందరినీ ఆకట్టుకోవడంతో పాటూ మంచి నటిగా కూడా పేరు తెచ్చుకుంది సంయుక్త.అమ్మడు ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో తన ఫోటోలను, అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఫ్యాన్స్ కు టచ్ లోనే ఉంటుంది. సంయుక్తకి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగే ఉంది.  తాజాగా సంయుక్త ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సంయుక్త తన లైఫ్ స్టైల్ గురించి చెప్పే క్రమంలో కొన్ని సంచలన కామెంట్స్ చేసింది. తనకు ఆల్కహాల్ సేవించే అలవాటుందని, కానీ అదే పనిగా తాగనని, ఎప్పుడైనా స్ట్రెస్ ఎక్కువైనప్పుడు మాత్రమే కొంచెం తీసుకుంటానని ఎలాంటి మొహమాటాలు లేకుండా చెప్పింది. మామూలుగా హీరోయిన్లకు ఇలాంటి అలవాట్లున్నా ఎవరూ బయటకు చెప్పుకోవడానికి ఇష్టపడరు. కానీ సంయుక్త మాత్రం ఎలాంటి సంకోచం లేకుండా ముక్కు సూటిగా చెప్పేసింది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పి తన ఫ్యాన్స్ ను ఆశ్చర్యపరిచిన సంయుక్త కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఫ్యాన్స్‌కి షాక్ ఇవ్వనున్న జాన్వీ..!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ ఇటీవలే టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఎన్టీఆర్‌తో కలిసి నటించిన 'దేవర' సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. జాన్వీ కపూర్ కెరీర్‌లో మొదటి బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. బాలీవుడ్‌లో గత ఐదేళ్లుగా వరుసగా సినిమాలు చేస్తున్నా ఇప్పటి వరకు కమర్షియల్ సక్సెస్‌ను సొంతం చేసుకోలేక పోయింది. హిందీలో కేవలం సినిమాలు మాత్రమే కాకుండా వెబ్ సిరీస్‌లను సైతం ఈ అమ్మడు చేసిన విషయం తెల్సిందే. జాన్వీ కపూర్ కెరీర్ ఆరంభం నుంచి విభిన్న పాత్రలు చేసేందుకు, సొంత ఇమేజ్‌ను పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే మరో వెబ్ సిరీస్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.  గతంలో హిందీలో వెబ్ సిరీస్‌ను చేసిన ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ ఈసారి కోలీవుడ్‌లో వెబ్ సిరీస్ చేయబోతుంది. శ్రీదేవి అంటే తమిళ్ ప్రేక్షకుల్లో ఇప్పటికీ చాలా అభిమానం ఉంది. అందుకే చాలా కాలంగా జాన్వీ కపూర్ కోలీవుడ్ ఎంట్రీ కోసం శ్రీదేవి అభిమానులు, తమిళ్ సినీ ప్రేమికులు ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు జాన్వీ కపూర్ కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది. కానీ అది ఒక వెబ్ సిరీస్‌తో కావడంతో ఫ్యాన్స్ ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కోలీవుడ్ స్టార్ హీరోలకు జోడీగా నటించడం ద్వారా కోలీవుడ్‌లో ఈ అమ్మడు ఎంట్రీ ఇస్తే బాగుంటుంది అని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ జాన్వీ కపూర్ మాత్రం విభిన్నమైన వెబ్ సిరీస్‌తో తమిళ్ ఆడియన్స్ ముందుకు వెళ్లబోతుంది.  విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరు సొంతం చేసుకున్న పా రంజిత్ దర్శకత్వంలో జాన్వీ కపూర్ వెబ్ సిరీస్ రూపొందబోతుంది. అందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. అణచివేతకు గురి కాబడ్డ ఒక తెగ గురించిన కథతో పా రంజిత్ వెబ్ సిరీస్‌ను రూపొందించబోతున్నారు. అందుకోసం ఆయన స్క్రిప్ట్ రెడీ చేశారు, ముఖ్య పాత్ర కోసం జాన్వీ కపూర్‌ను సంప్రదించారని, అందుకు ఆమె ఒప్పుకుందని తెలుస్తోంది. జాన్వీ కపూర్ వెబ్ సిరీస్‌లకు కొత్తేం కాదు. కానీ కోలీవుడ్‌లో జాన్వీ ఎంట్రీ ఒక పక్కా కమర్షియల్ సినిమాతో ఉంటే బాగుండేది అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.



# ఆ కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయా : రెజీనా

ఇండస్ట్రీకి వచ్చిన 14 ఏళ్ల తర్వాత బాలీవుడ్ పరిశ్రమలోకి అడుగుపెట్టారు నటి రెజీనా. ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు చేస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటులు కొనసాగడం కష్టమన్నారు. భాష రాకపోవడం వల్ల తాను ఎన్నో అవకాశాలు కోల్పోయినట్లు చెప్పారు.  "నేను 9 సంవత్సరాల వయసు నుంచి నటించడం ప్రారంభించాను. 25 ఏళ్లుగా ఎన్నో సినిమాలు, ప్రకటనల్లో నటించాను. కాబట్టి నాకు ఇండస్ట్రీ మీద అవగాహన ఉంది. పరిశ్రమలో నటిగా ఉండడం.. ముఖ్యంగా బాలీవుడ్‌లో దక్షిణాది నటిగా కొనసాగడం చాలా కష్టం. నేను హిందీ సినిమా కోసం ఆడిషన్ ఇచ్చినప్పుడు ఈ భాష మాట్లాడగలనో, లేదో అని చూశారు. దక్షిణాది సినిమా పరిశ్రమలో ఈ విషయాన్ని పట్టించుకోరు. ఏ భాషకు చెందినవారినైనా ఎంపిక చేసుకుంటారు. అందుకే కోలీవుడ్, టాలీవుడ్‌లలో ఇతర భాషలకు చెందిన ఎంతోమంది నటీనటులు అగ్ర తారలుగా ఎదిగారు. నేను హిందీ సరిగ్గా మాట్లాడలేకపోయినందున ఎన్నో అవకాశాలు కోల్పోయాను. నేను పంజాబీ అమ్మాయిగా నటించలేను. కానీ, ఒక పంజాబీ అమ్మాయి మాత్రం దక్షిణాది నటిగా చేయగలదు. నా విషయంలో అదే జరిగింది. నార్త్‌లో నటిస్తున్న హీరోయిన్‌లే సౌత్ ఇండియన్ సినిమాల్లోనూ నటిస్తున్నారు" అని చెప్పారు. సినిమాల విషయానికొస్తే.. రెజీనా ఇటీవల 'విదాముయార్చి'లో కనిపించారు. అగ్ర కథానాయకుడు అజిత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాను మగిజ్ తిరుమేని తెరకెక్కించారు. త్రిష, రెజీనా కీలకపాత్రల్లో కనిపించారు. ప్రస్తుతం రెజీనా రెండు హిందీ సినిమాలు, ఓ తమిళ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com